www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

| సంపుటి : 17 | సంచిక : 168 | ఆదివారం 09.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/- |
|---|---|---|---|---|---|



**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039


# జెన్ జీలకు ప్రధాని మోడీ సందేశం

**దేశ అవసరాలు తీర్చేలా నిర్ణయాలు**

## మీ శక్తిసామర్థ్యాలపై నమ్మకం ఉంది..



**రాబోయే 30-35 ఏళ్లలో యువత పాత్ర కీలకం**

- ప్రపంచ శక్తి సమీకరణాలు వేగంగా మారుతున్నాయి
- వికసిత్ భారత్‌కు స్వయంసమృద్ధే కీలకం: మోదీ
- ఆర్థిక, సాంకేతిక, పారిశ్రామిక రంగాల్లో ఆత్మనిర్భరత అవసరం
- ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ
- ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేత
- సమస్యలను చూసి భయపడొద్దు.. పరిష్కారాలపై దృష్టి పెట్టండి
- ప్రశ్నించడం కంటే పరిష్కారం కనుగొనడమే ముఖ్యం
- యువత శక్తి సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉంది: మోదీ 03

రీసెర్చ్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ప్రధాని వివరించారు. ప్రైమ్ మినిస్టర్స్ రీసెర్చ్ ఫెలోషిప్ ద్వారా ప్రతిభావంతులకు అవకాశాలు కల్పిస్తున్నామని నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి 'రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్'తో పాటు నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరిశోధన రంగం కోసం రూ. 1 లక్ష కోట్ల నిధుల కేటాయించినట్టు తెలిపారు.



# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ

**ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.5 వేల కోట్లు**

## 15 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు లక్ష్యం

### 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రణాళిక

తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాస పనులకు ప్రభుత్వం రూ.5,000 కోట్లు కేటాయించనుంది. ఇప్పటికే రూ.2,000 కోట్లు విడుదల కాగా, మరో రూ.3,000 కోట్లు ప్రక్రియలో ఉన్నాయి. మిడ్ మానేరు ఎడమ కాలువ పనులను పునఃప్రారంభించడంతో పాటు, పాతిపాక ప్రాజెక్టు డీపీఆర్‌ను ఆగస్టు చివరికల్లా సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, అటవీ అనుమతులను త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు.

### నిధులు, సమస్యలు, గడువులతో కార్యాచరణ ప్రణాళిక

- నిధుల కొరతతో ప్రాజెక్టుల పనులకు జాప్యం వద్దు
- భూసేకరణ, పునరావాస ప్రక్రియలను వేగవంతం చేయాలి
- అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్లు, నీటిపారుదల అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు
- మిడ్ మానేరు ఎడమ కాలువ పనులు వెంటనే ప్రారంభించాలి
- నాలుగున్నరేళ్లుగా నిలిచిన పనులకు మోక్షం
- భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా పూర్తి చేయాలి 03
- పాతిపాక రిజర్వాయర్ పనులకు వేగం
- 10 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు లక్ష్యం
- 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రణాళిక
- ఆగస్టు చివరికల్లా పాతిపాక డీపీఆర్ సిద్ధం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

తెలంగాణలో భూసేకరణ, పునరావాసం, పునరావాస పునరావాసం (R&R), అటవీ తదితర అనుమతుల కారణంగా నిలిచిపోయిన నీటిపారుదల ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం మాట్లాడుతూ.. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనుల కోసం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రూ.5 వేల కోట్లను ప్రాధాన్యతా క్రమంలో కేటాయించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3 వేల కోట్లు విడుదల ప్రక్రియలో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. పనులు తుది దశకు చేరుకున్న ప్రాజెక్టులకు...

# ఐక్య స్వరమే బలమైన భవిష్యత్తు

'ఐక్య స్వరమే బలమైన భవిష్యత్తు'



- ఐక్య స్వరమే బలమైన భవిష్యత్తుకు పునాది
- ఇండోర్‌లో పశ్చిమ మండల ప్రాంతీయ సదస్సు
- 'యునైటెడ్ వాయిస్-స్ట్రాంగర్ టుమారో'పై సీజేఐ ప్రశంసలు 02
- సంభాషణ, ఆత్మగౌరవం, సమ్మేళనమే ఇతివృత్తానికి ఆధారం
- న్యాయ వ్యవస్థ బలోపేతానికి సమిష్టి చర్చలు అవసరం
- ప్రజలకు సులభంగా న్యాయం అందించడమే లక్ష్యం



# ఎక్స్ వేదికగా పరస్పరం సెటైర్లు

## డీలిమిటేషన్.. మహిళా బిల్లు

- 'కాంగ్రెస్ నుంచి సానుకూల సందేశం' అంటూ రిజిజు ఎద్దేవా
- మహిళా రిజర్వేషన్ బిల్లుకు 2023లోనే ఏకగ్రీవ ఆమోదం: రాహుల్ 02
- మహిళల ప్రతిభకు స్వేచ్ఛ కల్పించాల్సిందే: రాహుల్
- మహిళా రిజర్వేషన్లపై కేంద్రం-ప్రతిపక్షం మధ్య మాటల యుద్ధం



# తాగిన మత్తులోనే సూసైడ్ నోట్ రాశా

## సూసైడ్ నోట్ బయటకు ఎలా వచ్చింది?: సీపీ సజ్జనార్ ప్రశ్న


- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో మరో ట్విస్ట్
- సూసైడ్ నోట్‌పై పోలీసుల విచారణలో కీలక విషయాలు
- తాగిన మత్తులోనే సూసైడ్ నోట్ రాశానన్న ఉదయ్
- ఇప్పుడు ఆ నోట్ ఎక్కడుందో తెలియదంటున్న ఉదయ్
- సూసైడ్ నోట్‌లోని ఆధారాలు ఐఫోన్‌లో ఉన్నాయని వెల్లడి 02

# రూ.34.23 లక్షల చెక్ బౌన్స్ కేసు..

- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డికి మరో ఎదురుదెబ్బ 05
- రూ.34.23 లక్షల చెక్ బౌన్స్ కేసులో దోషిగా నిర్ధారణ
- రోహిత్‌రెడ్డిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ

# కేసీఆర్ భారీ ఆర్థికసాయం..

## రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయం..



- దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ అండ
- పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం
- ఇద్దరు పిల్లల భవిష్యత్తు కోసం చెరో రూ.కోటి
- పిల్లల పేరిట రూ.2 కోట్లను కేటాయించిన బీఆర్ఎస్
- వృద్ధ తల్లి అమృతమ్మకు రూ.25 లక్షల ఆర్థిక భరోసా 03

**పార్టీ నాయకత్వం నుంచి భారీ ఆర్థిక భరోసా**

వృద్ధ తల్లి అమృతమ్మకు రూ.25 లక్షల ఆర్థిక భరోసా

# ఎవరైనా ఒళ్లు దగ్గర పెట్టుకోవాల్సిందే

- యువత పోరాటాలకు రాజకీయ పార్టీలు స్పందించాల్సిందే
- జెన్‌జీ ఉద్యమానికి బీజేపీ నేతల పిల్లల మద్దతు
- జెన్‌జీ పోరాటం సరైనదేనన్న ఆర్ఎస్ఎస్ చీఫ్
- యువత ఆలోచనలు దేశ రాజకీయాల దిశను మార్చనున్నాయి
- విద్యకు తెలంగాణలో తక్కువ బడ్జెట్ కేటాయింపులు
- విద్యకు అధిక నిధులతో తమిళనాడు ముందంజ
- తల్లిదండ్రుల ఓట్లపై యువత ప్రభావం చూపింది
- రిజర్వేషన్లు కాదు.. ముందుగా కుల వ్యవస్థ పోవాలి 02
- కులం తొలగింపుతోనే సమానత్వానికి బాట

**వరంగల్‌లో 'యూత్ మీట్‌అప్ విత్ తీన్మార్ మల్లన్న'**



# డీలిమిటేషన్ సాకు వెనకడాకొద్దు..



- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌ను వేరు చేయాలి
- మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం వెంటనే కల్పించాలి
- సాకులు, షరతులు లేకుండా రిజర్వేషన్ అమలు చేయాలి
- మహిళల రాజకీయ సాధికారతపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి 02
- మహిళా రిజర్వేషన్ అమలులో జాప్యాన్ని ప్రశ్నించిన మంత్రి

# ఎందుకింత కక్ష రేవంత్ రెడ్డి?..

## నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోండి

- హైడ్రా ఉద్యోగాల ఘటనపై హరీశ్‌రావు ఆగ్రహం
- నిరుద్యోగులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి
- సరూర్‌నగర్‌లో తోపులాట.. అధికారుల తీరుపై మండిపాటు
- ఉద్యోగాల కోసం వచ్చిన యువతను అవమానిస్తారా?
- 150 పోస్టులకు వేలాది మంది రావడం నిరుద్యోగుల తప్పా?
- ఉద్యోగాలు కల్పించడంలో విఫల మైనది ప్రభుత్వమే
- నిరుద్యోగుల పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? 03



# పాక్ హనీట్రాప్‌లో వాయుసేన అధికారి..

## రక్షణ రహస్యాలు లీక్ చేసిన వింగ్ కమాండర్ అరెస్ట్

**ఢిల్లీ :** భారతీయ వాయుసేన లో ఆందోళనకర పరిణామం చోటుచేసుకుంది. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ వేసిన హనీట్రాప్‌లో చిక్కుకుని దేశ రక్షణ రహస్యాలను శత్ర-ువులకు చేరవేసిన ఓ వింగ్ కమాండర్ హోదా కలిగిన అధికారిని ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు అతడిపై ఆఫిషియల్ సీక్రెట్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి తీహార్ జైలులో జ్యూడీషియల్ కస్టడీకి తరలించారు.

**హనీట్రాప్‌తో పక్కా ఇన్ఫర్మేషన్ సేకరణ..**

సోషల్ మీడియా ద్వారా సదరు వింగ్ కమాండర్‌తో పరిచయం పెంచుకున్న ఓ అజ్ఞాత మహిళ, వీడియో కాల్స్, చాటింగ్ ద్వారా ఆయనను లోబరుచుకుంది. అనంతరం భారత సైనిక దళాల కదలికలు, కీలక వ్యూహాత్మక ప్రాంతాలు, మిలిటరీ యూనిట్ల వివరాలను ఫోటోలు, వీడియోల రూపంలో సేకరించినట్లుగా ప్రాథమిక విచారణలో తేలింది. కేవలం దళ రహస్యాలు చేరవేయడమే కాకుండా, తనతో పనిచేసే మరో ఎయిర్‌ఫోర్స్ అధికారి మొబైల్ ఫోన్‌లో సమాచారాన్ని దొంగిలించేలా ఓ ప్రమాదకరమైన స్పైవేర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి కూడా ఆ వింగ్ కమాండర్ ప్రయత్నించినట్లుగా అధికారులు గుర్తించారు. ఈ మొత్తం తతంగా వెనుక పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఐఎస్ఐ హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అయితే, ఈ వ్యవహారాన్ని ముందుగానే గుర్తించిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం, ఆ అధికారిని కొంతకాలంగా తమ నిఘా పరిధిలో ఉంచింది. ఆయన అనుమానాస్పద కార్యకలాపాలను నిర్ధారించుకున్న అనంతరం, ఆధారాలతో సహా ఢిల్లీ పోలీసులకు సమాచారం అందించి కస్టడీకి అప్పగించింది.

# ఎఫ్‌డీఏ సోదాలు..

## రూ.1.93 కోట్ల విలువైన కల్తీ వంటనూనె సీజ్

**మహారాష్ట్ర :** మహారాష్ట్రలో వంటనూనెల కల్తీపై ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ ఉక్కుపాదం మోపింది. బీడ్ జిల్లాలో తాజాగా సోదాలు నిర్వహించి రూ. 1.93 కోట్ల విలువైన కల్తీ వంట నూనెను సీజ్ చేసింది. మిలియన్ల లీటర్ల నూనెను స్వా-ధీనం చేసుకుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లోగల సంస్థల్లో ఈ రెయిడ్స్ నిర్వహించింది. ఇంతటి స్థాయిలో కల్తీ నూనె వెలుగుచూడటం జిల్లా చరిత్రలో ఇదే తొలిసారి అన్న వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం, ఆగస్టు 6,7 తేదీల్లో ఈ రెయిడ్స్ జరిగాయి. మొత్తం 1,18,940 కేజీల కల్తీ నూనెలను స్వాధీనం చేసుకున్నారు. ఒకే నాణ్యత గల నూనెలకు రిఫైన్డ్, అల్ట్రా రిఫైన్డ్ అని రాసున్న ప్యాకెట్లల్లో రీప్యాకేజింగ్ చేసి విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడినట్టు వెలుగులోకి వచ్చింది. పలు సంస్థల్లో అపరిశుభ్రంగా ఉన్న స్టోరేజీ ట్యాంకులు కూడా బయటపడ్డాయి. స్వాగత్ ఆయిల్, చర్ఖా ఆయిల్ సంస్థల్లో ఈ అవకతవకలు బయటపడ్డాయి. ఇతర సంస్థల్లోనూ ఇలాంటి అక్రమాలను అధికారులు గుర్తించారు. అక్రమాలకు పాల్పడ్డ నాలుగు సంస్థల లైసెన్స్‌ను అధికారులు రద్దు చేశారు. సంస్థలకు సీల్ వేశారు. మొత్తం 26 శాంపిళ్లను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌లకు తరలించారు.

# ఎక్స్ వేదికగా పరస్పరం సెటైర్లు

## మహిళా బిల్లుపై కిరణ్ రిజిజు Vs రాహుల్..



**ఢిల్లీ :** దేశ రాజకీయాల్లో డీలిమిటేషన్, మహిళా బిల్లు అంశం మరోసారి పొలిటికల్ హీట్ పెంచుతోంది. త్వరలోనే నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతున్న వేళ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య రాజకీయం ఆసక్తికరంగా మారింది. తన ట్వీట్ పై కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. మన దేశంలో మహిళలకు తమ శక్తిని వ్యక్తీకరించేందుకు వారికి అవకాశం ఇవ్వడం లేదని, నా దృష్టిలో, మహిళలు తమ ప్రతిభను, ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తీకరించలేని దేశం ఏదీ విజయవంతం కాలేదంటూ నిన్న రాహుల్ గాంధీ ఓ వీడియో రిలీజ్ చేశారు. అయితే ఈ వీడిపై శనివారం స్పందించిన కిరణ్ రిజిజు రాహుల్ గాంధీ మనసు మారినట్లుందే.. కాంగ్రెస్ నుంచి ఎట్టకేలకు సానుకూల సందేశం వచ్చిందంటూ ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు.

**రాహుల్ రియాక్షన్:**

రిజిజు వ్యాఖ్యలపై స్పందించిన రాహుల్ గాంధీ.. మహిళా రిజర్వేషన్ బిల్లు 2023 లోనే కాంగ్రెస్ మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని, ఈ విషయం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా మీకంటే బాగా ఎవరికి తెలుస్తుంది? అని కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజుకు రాహుల్ పలు ప్రశ్నలు సంధించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు చట్ట రూపం దాల్చి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. దీని అమలును అనవసరంగా డీలిమిటేషన్ ప్రక్రియతో ఎందుకు ముడిపెడుతున్నారు? అని ప్రశ్నించారు. ఎలాంటి షరతులు లేకుండా, వెంటనే 2023 నాటి చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# ఐక్య స్వరమే బలమైన భవిష్యత్తు

**మధ్యప్రదేశ్ :** ఐక్య స్వరమే బలమైన భవిష్యత్తు అని సుప్రీంకోర్టు సీజేఐ సూర్య కాంత్ అన్నారు. ఈ రోజు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో నిర్వహించిన 'పశ్చిమ మండల ప్రాంతీయ సదస్సు' లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సదస్సుకు విచ్చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సభ్య కార్యదర్శులు, లీగల్ ఎయిడ్ కమిటీల సభ్యులు మరియు పారా లీగల్ వాలంటీర్లకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సదస్సు కోసం ఎంచుకున్న 'యునైటెడ్ వాయిస్, స్ట్రాంగర్ టుమారో' (ఐక్య స్వరం – బలమైన భవిష్యత్తు) అనే నేపథ్యం ఎంతో అర్థవంతమైనదని సీజేఐ కొనియాడారు. ఈ ఇతివృత్తం 'సంభాషణ , ఆత్మగౌరవం , సమ్మేళనం/అందరినీ కలుపుకుపోవడం ' అనే మూడు కీలకమైన పదాల పునాదిపై ఆధారపడి ఉందని వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి, ప్రజలకు సులభంగా న్యాయం అందించడానికి ఈ రకమైన చర్చలు, సమావేశాలు ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# డీలిమిటేషన్ సాకు వెనక దాక్కోవద్దు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భద్రత నుండి ప్రాతినిధ్యం వరకు మహిళలకు బీజేపీ ద్రోహం చేస్తూనే ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. బీజేపీ మహిళా వ్యతిరేక వైఖరి యావత్ దేశానికి తెలుసని, దశాబ్దాలుగా అధికారంలో ఉన్నప్పటికీ ఆ పార్టీ ఎన్నడూ ఒక మహిళను జాతీయ అధ్యక్షురాలిగా నియమించలేదని దుయ్యబట్టారు. కానీ కాంగ్రెస్ పార్టీ భారతదేశానికి మొట్టమొదటి మహిళా రాష్ట్రపతిని, మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిని ఇచ్చిందని అంతేకాకుండా కాంగ్రెస్ అధ్యక్ష పదవితో సహా పార్టీలోని అత్యున్నత నాయకత్వ పదవులను మహిళలకు అప్పగించిందన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్టు చేసిన మంత్రి.. దేశవ్యాప్తంగా, పలువురు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తీవ్రమైన లైంగిక వేధింపుల ఆరోపణలను ఎదుర్కొంటున్నారని అయినప్పటికీ చర్యలు తీసుకోకపోగా వారిని రక్షిస్తూ వస్తోందని ఆరోపించారు.

**డీలిమిటేషన్ సాకు వెనుక దాక్కోవడం మానుకోవాలి:**

మహిళల పురోగతికి, సాధికారతకు వ్యతిరేకంగా ఉండే పార్టీ ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన సాకుతో మహిళా రిజర్వేషన్ చట్టం అమలును ఆలస్యం చేస్తోందని దుయ్యబట్టారు. ఇకనైనా బీజేపీ నియోజకవర్గాల పునర్విభజన సాకు వెనుక దాక్కోవడం మానుకుని డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ చట్టం అమలు నుండి వేరు చేయాలన్నారు. ఎటువంటి సాకులు, ష-రతులు లేకుండా మహిళలకు వారి న్యాయమైన ప్రాతినిధ్యాన్ని వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు.

# డాక్టర్ సాగి...రికార్డుల మోతమోగి


## 111 డాక్టరేట్లను సాధించిన ఏకైక డాక్టర్

- తాజాగా లండన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు
- నాలుగు పర్యాయాలు గిన్నిస్ బుక్‌లో
- డాక్టర్ సాగి సత్యనారాయణ పేరు నమోదు
- 111 డాక్టరేట్లను సాధించిన ఏకైక డాక్టర్
- ఆస్కార్ ఇన్ ఎక్సలెన్సీ అవార్డు దక్కించుకున్న
- అరుదైన ఘనత డాక్టర్ సొంతం



**హైదరాబాద్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రతిభకు ప్రపంచవ్యాప్త గుర్తింపు హైదరాబాద్ మల్కాజ్‌గిరివాసి డాక్టర్ సాగి సత్యనారాయణ గుర్తింపు పరంపర ఇంకా కొనసాగుతూనే ఉంది. లండన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో తాజాగా ఆయన పేరు నమోదయ్యింది. దీంతో ఆయన ప్రతిభకు మరోసారి అంతర్జాతీయస్థాయిలో మరోసారి గుర్తింపు లభించినట్టయ్యింది. ఇదిలా ఉంచితే ప్రతిభావంతుడికి గుర్తింపు అనేది ఓ ఆభరణం. ప్రతిభ అనేది పూర్వజన్మ సుకృతం. ఒక్క జన్మ కాదు అనేకానేక జన్మల పుణ్యఫలం. అందరకీ అటువంటి యోగం లభించదు. అటువంటి యోగులు, ప్రతిభావంతులు అత్యంత అరుదుగా ఉంటారు. సికింద్రాబాద్ మల్కాజ్గిరి లోని ఆనంద్ నగర్ నివాసి డాక్టర్ సాగి సత్యనారాయణ కలియుగ వాల్మీకి. పుస్తకాలు కాదు...అనేక గ్రంథాలు రచించారు. అందువల్లనే ఆయన కలియుగ వాల్మీకి. డాక్టర్ సాగి సత్యనారాయణ అత్యంత తక్కువ వ్యవధిలో అత్యధిక గ్రంథాలను రచించారు. వృత్తిరీత్యా వైద్యుడిగా సేవలందిస్తూనే ఖాళీ సమయాన్ని గ్రంథ రచనకు కేటాయించారు. ఏడాది కాలంలో 72కుపైగా పుస్తకాలను రచించారు. యోగాభ్యాసాలు, ధ్యానం, మెడికల్ సైన్సెస్,ఎమర్జెన్సీ మెడిసిన్, ఆదిత్య దర్శనం, శ్రీ సత్యసాయి భాగవతం, శ్రీ దత్తాత్రేయ గురుచరిత్ర, శివరహస్యాలు వంటి సామాజిక, ఆధ్యాత్మిక గ్రంథాలు కూడా ఉన్నాయి. పదేళ్ల కాలంలో మొత్తం 180 గ్రంథాలను రచించారు. ఈ నేపథ్యమే ఆయనకు రాష్ట్రీయస్థాయినుంచి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చింది. స్వల్ప వ్యవధిలో అసాధారణరీతిలో గ్రంథ రచన, ప్రచురణ చేసినందుకుగాను మొత్తం నాలుగు గిన్నిస్ రికార్డులు దక్కాయి. తొలి గిన్నిస్ రికార్డును 2016 జనవరి 28న అందుకోగా, రెండోది అదే ఏడాది ఆగస్టులో వచ్చింది. మూడో గిన్నిస్ రికార్డును 2019 అక్టోబర్ 3వ తేదీన దక్కించుకున్నారు. 2022 ఆగస్టు 22న నాలుగోసారి గిన్నిస్ వరల్డ్ రికార్డులో డాక్టర్ సాగి పేరు నమోదయ్యింది. భారత ప్రతిభారత్న అంటూ ఆస్కార్ సంస్థ డాక్టర్ సత్యనారాయణపై ప్రశంసల జల్లు కురిపించింది. వివిధ అంశాలపై ఆయన రాసిన పుస్తకాల పేర్లను ప్రస్తావిస్తూ 2020. డిసెంబర్ 25న ఆస్ట్రేలియాలో జరిగిన కార్యక్రమంలో ఆస్కార్ ఇన్ ఎక్సలెన్సీ పు-రస్కారాన్ని ప్రకటించి అందజేసింది. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలనుంచి అత్యధికంగా 111 డాక్టరేట్లను సాధించి అందరినీ అబ్బురపరిచారు....డాక్టర్ సాగి సత్యనారాయణ. ప్రపంచంలోనే అత్యధిక డాక్టరేట్లను సాధించిన గొప్ప వ్యక్తిగా నిలిచారు. ఇందులో ,డాక్టర్ ఆఫ్ సైన్స్ 15 .. డాక్టర్ ఆఫ్ లిటరేచర్లు 25తోపాటు 71 డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఉండడం విశేషం. ఇదంతా కేవలం 41 ఏళ్ల వ్యవధిలోనే సాధించారు. డాక్టర్ సాగి సత్యనారాయణ ప్రతిభాపాతవాలకు గుర్తింపు లభిస్తూనే ఉంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ కేంద్రంగా పనిచేస్తున్న మా భువనేశ్వరి విశ్వవిద్యాలయం...ఈ డాక్టర్‌గారికి మరో డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. అలాగే తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయం ఇంకో డాక్టరేట్ అందజేశాయి. ఇక గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వేదిక్ హిందూ విశ్వవిద్యాలయం ఇంకో డాక్టరేట్‌ను అందజేయడమే కాకుండా వైస్ చాన్సలర్ గా కూడా నియమించింది. తాజాగా ఈ డాక్టర్ పేరు లండన్ బుక్ ఆఫ్ రికార్డ్సులోనూ నమోదయ్యింది.

# తాగిన మత్తులోనే సూసైడ్ నోట్ రాశా



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో మరో ట్విస్ట్ తెరపైకి వచ్చింది. సీపీ సజ్జనార్ అతడిని సూసైడ్ నోట్ గురించి విచారించగా.. తాగిన మైకంలోనే అలా చేసినట్లు తెలిపాడు. తాగిన మత్తులోనే సూసైడ్ నోట్ రాశానని చెప్పిన ఉదయ్ కృష్ణారెడ్డి.. ఇప్పుడు ఆ సూసైడ్ నోట్ ఎక్కడుందో తనకు తెలీదని పేర్కొన్నాడు. తాను రాసిన సూసైడ్ నోట్ లో పేర్కొన్న వాటికి సంబంధించిన ఆధారాలు ఐఫోన్ లో పొందుపరిచినట్లు తెలిపాడు. కానీ ఆ ఫోన్ ను కూడా ఉదయం మాయం చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. సూసైడ్ నోట్ ఎలా బయటికి వచ్చిందని సీపీ సజ్జనార్ ప్రశ్నించగా.. అందుకు సమాధానం చెప్పలేదని తెలుస్తోంది. ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక ఆరోపణల కేసు నమోదైన మర్నాడే అతను సూసైడ్ అటెంప్ట్ చేసినట్లు వార్తలొచ్చాయి. కానీ మోతాదుకు మించి మద్యం తాగడం వల్లే అతను ఎక్కువ సమయం మత్తులో ఉన్నాడని వైద్యులు నిర్ధారించారు. ఆ తర్వాత ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. అతనికి మరో ఇద్దరు మహిళలతోనూ సంబంధాలున్నట్లు గుర్తించారు పోలీసులు. ఇక తాజాగా ఉదయ్ కృష్ణారెడ్డి తమ్ముడి పాత్రపై కూడా పోలీసులు దృష్టిపెట్టారు. టెక్నికల్ ఎవిడెన్స్ గా అతడిని కూడా ఈ కేసులో నిందితుడిగా చేర్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. సూసైడ్ నోట్ కేవలం ఒక డ్రామానేనా? ప్లాన్ ప్రకారమే దానిని మీడియాకు లీక్ చేశారా ? అన్నదానిపై విచారణ చేస్తున్నారు. దీనిపై ప్రశ్నించేందుకు ఉదయ్ ను మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరనున్నారు.

# జీ20లో వేగవంతమైన వృద్ధి రేటు మనదే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ తాజా గణాంకాల ప్రకారం 2014–2026 కాలంలో జీ20 దేశాల్లోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా భారత్ చరిత్ర సృష్టించింది. కోవిడ్–19 మహమ్మారి, గ్లోబల్ సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ యుద్ధాల వంటి కఠినమైన సవాళ్లు ఉన్నప్పటికీ.. నామినల్ డాలర్ రూపంలో భారత్ సగటున 6.1 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేసింది. ఈ రేసులో చైనా (5.9 శాతం), అమెరికా (5.3 శాతం)ను సైతం భారత్ దాటేసింది. సౌదీ అరేబియా 5.1 శాతం, టర్కీ 4.8 శాతం, ఇండోనేషియా 4.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఈ దశాబ్దకాలంలో భారత ఆర్థికవ్యవస్థ పరిమాణం ఏకంగా రెట్టింపు కంటే ఎక్కువ పెరిగి, ప్రస్తుతం 4.15 ట్రిలియన్ డాలర్లకు చేరింది.

**మౌలిక సదుపాయాల దూకుడు**

భారత్ వృద్ధికి మౌలిక సదుపాయాలపై పెరిగిన పెట్టుబడులు కూడా కీలకంగా మారాయి. దేశంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 248 గిగావాట్ల నుండి 532.74 గిగావాట్లకు పెరగడం, జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణతో రవాణా, లాజిస్టిక్స్, వ్యాపార కార్యకలాపాలకు మద్దతు పెరిగింది. ఇదే సమయంలో తయారీ సామర్థ్యాన్ని పెంచడం, పెట్టుబడులను ఆకర్షించడం, భౌతిక–డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం వంటి చర్యలు కొనసాగాయి. గత దశాబ్దంలో ఏడో స్థానంలో ఉన్న భారత్, ప్రపంచవ్యాప్తంగా వరుస అంతరాయాలు ఎదురైనప్పటికీ 2014–2026 కాలంలో జీ20లో టాప్‌కు చేరడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ప్రాధాన్యం పెరుగుతున్నదనే దానికి బలమైన సంకేతమని ఐఎంఎఫ్ పేర్కొంది.



# ఎవరైనా ఒళ్లు దగ్గర పెట్టుకోవాల్సిందే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఈ దేశ రాజకీయాలను యువతనే శాసించబోతోందని, ఈ దేశానికి ఏం కావాలో యువతనే నిర్ణయిస్తుందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. జెన్ జీ దగ్గర ఎవ్వరైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉండాల్సిందేనని ఇది తప్పదన్నారు. శనివారం వరంగల్ లో యూత్ మీటప్ విత్ తీన్మార్ మల్లన్న కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. జెన్ జీ పోరాటానికి అనేక బీజేపీ మంత్రుల పిల్లలే మద్దతు తెలిపారని, తాజాగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సైతం జెన్ జీ చేస్తున్నది సరైనదే అని చెప్పారని గుర్తు చేశారు.

**రిజర్వేషన్లు కాదు కులం పోవాలి:**

చదువుకోసం తక్కువ బడ్జెట్ ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలోనే తెలంగాణ అని తీన్మార్ మల్లన్న అన్నారు. తమిళనాడులో జెన్ జీ యువత అంతా తమ తల్లిదండ్రుల ఓట్లను పట్టుబట్టి విజయ్ పార్టీకి వేయించారని ఇప్పుడు ఆ రాష్ట్ర బడ్జెట్ లో విద్యకోసం భారీగా కేటాయింపులు చేశారని అన్నారు. తమిళనాడు ప్రస్తుతం దేశంలోనే విద్యకు అత్యధిక బడ్జెట్ కేటాయించిన రాష్ట్రాల జాబితాలోకి చేరిపోయిందన్నారు. ప్రస్తుతం చాలా మంది రిజర్వేషన్లు తీసేయాలని మాట్లాడుతున్నారని కానీ రిజర్వేషన్ల కంటే ముందు కులాన్ని తొలగించాలన్నారు. ఈ విషయాన్ని వే-ంము మాట్లాడుతుంటే కొంత మంది మా కులం ఆనవాళ్లు తొగించుకుంటామంటున్నారు కానీ ఆర్థిక సమానత్వం మాత్రం వద్దంటున్నారని అన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# ఎందుకింత కక్ష రేవంత్ రెడ్డి?..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైడ్రా ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ విషయంలో ఇవాళ ఉదయం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన తోపులాట, అభ్యర్థులపై అధికారుల పరుష పదజాలంపై మాజీ మంత్రి హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో ఉద్యోగాలిస్తామని విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకు ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? అని నిలదీశారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలి వస్తే ఇది నిరుద్యోగుల తప్పా? లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా? అని ప్రశ్నించారు. ఈ మేరకు హరీశ్ రావు ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే మీ ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు.

**సీఎం బాటలోనే అధికారులు:**

ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో "క్రిమినల్ వేస్ట్" అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే "యథా రాజా.. తథా అధికారులు" అన్న సామెత గుర్తుకొస్తోందని హరీశ్ రావు అన్నారు. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం అని, ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు? అని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. 32 నెలలు దాటింది, ఆ హామీ ఏమైందన్నారు.

**యువతలో నిరాశ పెరుగుతోంది:**

రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్, మీ జాబ్ క్యాలెండర్ బోగస్, నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్ అని దుయ్యబట్టారు. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోందని నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

**నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోండి:**

ఇవాళ సరూర్ నగర్ లో జరిగిన ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి ఏకంగా విద్యార్థులపైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి గారూ.. నిరుద్యోగులు మీపై జాలి అడగడం లేదు. మీరు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్నారని ఉద్యోగం అడగడం నేరం కాదు. ప్రశ్నించడం నేరం కాదు. ప్రభుత్వాన్ని నిలదీయడం నేరం కాదన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం కనీసం ఉద్యోగం కోసం వచ్చిన నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగ లోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# కేసీఆర్ భారీ ఆర్థికసాయం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన బీఆర్ఎస్ నాయకుడు, స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం, పార్టీ తరఫున పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి మొత్తంగా రూ. 2 కోట్ల 25 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందజేయాలని అధినేత నిర్ణయించారు. ఈ ఆర్థిక సాయంలో భాగంగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు వారి భవిష్యత్తు కోసం చెరో కోటి రూపాయల చొప్పున రూ. 2 కోట్లు కేటాయించారు. అలాగే, వృద్ధాప్యంలో ఉన్న ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల నిమిత్తం మరో రూ. 25 లక్షలను ఆమె పేరిట బ్యాంకులో జమ చేయాలని ఆదేశించారు. కేవలం ఆర్థిక సహాయంతోనే సరిపెట్టకుండా, పిల్లల చదువులు, కుటుంబ సంక్షేమాన్ని పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ బాధ్యత తీసుకుంటుందని కేసీఆర్ హామీ ఇచ్చారు. దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మ పూర్తయిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్య నేతలు సమావేశమై, ఆ కుటుంబానికి సంబంధించిన మరిన్ని సంక్షేమ కార్యక్రమాలపై నిర్ణయం తీసుకుంటారని కేసీఆర్ ఓ ప్రకటనలో తెలిపారు. పెద్ది కుటుంబానికి ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# జెన్ జీలకు ప్రధాని మోడీ సందేశం

## మీ శక్తిసామర్థ్యాలపై నమ్మకం ఉంది..

**ఢిల్లీ :** సాంకేతిక పురోగతి కారణంగా ప్రపంచ శక్తి సమీకరణాలు వేగంగా మారుతున్నాయని వికసిత్ భారత్ సాధనకు ఆర్థిక, సాంకేతిక, పారిశ్రామిక రంగాలు స్వయంసమృద్ధి సాధించడం అత్యంత కీలకమని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. శనివారం జరిగిన ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతిష్ఠాత్మక ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్, డైరెక్టర్స్ గోల్డ్ మెడల్, శంకర్ దయాళ్ శర్మ గోల్డ్ మెడల్ సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రధాని మోడీ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన దేశ యువతకు కీలక సూచనలు చేశారు. పెద్ద సమస్యలు ఎదురైనప్పుడు వాటిని చూసి భయపడకుండా వాటికి పరిష్కారాలు కనుగొనే ధైర్యాన్ని ప్రదర్శించాలని విద్యార్థులకు మోడీ పిలుపునిచ్చారు. అందుకే, ప్రశ్నించడం కాదు.. సమస్యకు పరిష్కారం కనుగొనడంపై దృష్టిపెట్టాలని సూచించారు. ఈ దేశ యువతరం శక్తి సామర్థ్యాలపై తమకు ఎంతో విశ్వాసం ఉందని అన్నారు.

**దేశ అవసరాలు తీర్చేలా నిర్ణయాలు:**

రాబోయే 30–35 ఏళ్లలో మీరు ఏం చేస్తున్నారన్నదే వికసిత్ భారత్‌ను నిర్ణయిస్తుందని మోడీ చెప్పారు. అందువల్ల మీరు తీసుకునే ఏ నిర్ణయమైనా సరే.. ఈ దేశానికి ఏ విధంగా ఉపయోగపడుతుందనేది ఆలోచించాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచం, సాంకేతికత, పరిశ్రమలు ఎలా మారతాయో ఊహించడం చాలా కష్టం అని అయితే ఈ మార్పుల మధ్య నిరంతరం నేర్చుకునే వారే విజయం సాధిస్తారని అన్నారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత కూడా భాగస్వామి కావాలని, యువత తీసుకునే ప్రతి నిర్ణయం దేశ ప్రయాణాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. అందువల్ల మీరు చేసే ప్రతి పని దేశ అవసరాలను తీర్చేలా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. సెమీకండక్టర్లు, డ్రోన్ల రంగంలో లభిస్తున్న అవకాశాలను ప్రధాని గుర్తుచేశారు. చిప్స్ నుంచి షిప్స్ వరకు ప్రతీదీ భారత్‌లోనే తయారవుతుందని, వ్యవసాయం, వైద్యం, రక్షణ రంగాల్లో యువత డ్రోన్ సాంకేతికతతో కొత్త ఆవిష్కరణలు చేస్తోందని తెలిపారు.

**పరిశోధనలకు ప్రోత్సాహం:**

రీసెర్చ్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ప్రధాని వివరించారు. ప్రైమ్ మినిస్టర్స్ రీసెర్చ్ ఫెలోషిప్ ద్వారా ప్రతిభావంతులకు అవకాశాలు కల్పిస్తున్నామని నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి 'రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్'తో పాటు నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరిశోధన రంగం కోసం రూ. 1 లక్ష కోట్ల నిధుల కేటాయించినట్టు తెలిపారు. వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ ద్వారా అంతర్జాతీయ రీసెర్చ్ జర్నల్స్ చిన్న పట్టణాల్లోని విద్యార్థులకు కూడా ఉచితంగా లభించే వెసులుబాటు కల్పించామన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో భూసేకరణ, పునరావాసం, పునరావాస పునరావాసం (ఆర్అండ్ఆర్), అటవీ తదితర అనుమతుల కారణంగా నిలిచిపోయిన నీటిపారుదల ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం మాట్లాడుతూ.. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనుల కోసం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రూ.5 వేల కోట్లను ప్రాధాన్యతా క్రమంలో కేటాయించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3 వేల కోట్లు విడుదల ప్రక్రియలో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. పనులు తుది దశకు చేరుకున్న ప్రాజెక్టులకు నిధుల కొరత కారణంగా జాప్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

**భూసేకరణకు అత్యధిక ప్రాధాన్యం**

పూర్వపు కరీంనగర్ జిల్లాలోని ప్రస్తుత కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అమలవుతున్న నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులను వెంటనే ప్రతిపాదించి, టోకెన్లు పొందాలని సూచించారు. సాధ్యమైన చోట భూసేకరణ పరిహారం, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల పునరావాస ప్రక్రియను ఇంజినీరింగ్ పనులతో సమాంతరంగా చేపట్టాలని తెలిపారు.

**మిడ్ మానేరు ఎడమ కాలువ పనులకు వేగం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని మంత్రి తెలిపారు. ఇప్పటికే పెట్టుబడి పెట్టిన భారీ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్ మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పునఃప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. భూసంబంధిత సమస్యలను పరిష్కరించడంతో పాటు సవరించిన అంచనాలు, భూసేకరణ, టెండర్లు, చట్టబద్ధమైన అనుమతుల ప్రక్రియలను ఒకేసారి ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**పాతిపాక రిజర్వాయర్‌పై ప్రత్యేక దృష్టి**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి రిజర్వాయర్ (పాతిపాక) ప్రాజెక్టును వేగవంతం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు కాకతీయ మెయిన్ కెనాల్‌లోని డీ-83 నుంచి డీ-94 వరకు సుమారు 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ధర్మపురి, చొప్పదండి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు ఈ ప్రాజెక్టు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం 3 టీఎంసీలు, 5 టీఎంసీల సామర్థ్యంతో రెండు ప్రత్యామ్నాయాలపై పరిశీలన జరుగుతోంది. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ పూర్తయ్యాయి. బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఆగస్టు చివరి నాటికి డీపీఆర్ సమర్పిస్తామని అధికారులు మంత్రికి తెలిపారు.

**96 శాతం పూర్తయిన రోళ్లవాగు**

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు కూడా సమీక్షకు వచ్చింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు 96 శాతం పూర్తయింది. స్థానిక క్యాచ్‌మెంట్‌ను వినియోగించుకుని ప్రస్తుత 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని సుమారు 0.949 టీఎంసీలకు పెంచడం ద్వారా దాదాపు 15 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యం. మూడు బండ్లు, సర్‌ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లతో పాటు ప్రధాన పనులు దాదాపుగా పూర్తయ్యాయి. అయితే బండ్-2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు ప్రధానంగా అటవీ అనుమతులపై ఆధారపడి ఉన్నాయి. పరిహార అటవీ పెంపకానికి అవసరమైన భూమిని ఇప్పటికే గుర్తించగా, వన్యప్రాణుల సంరక్షణ ప్రణాళికకు కూడా ఆమోదం లభించింది.

**ప్రతి సమస్యకు గడువు.. ప్రత్యేక కార్యాచరణ**

ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ, పర్యావరణ అనుమతుల సమస్యలపై ప్రత్యేక జాబితా రూపొందించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన నిధులు, సమస్య ప్రస్తుత దశ, పరిష్కారానికి నిర్దేశించిన గడువు వంటి వివరాలను అందులో పొందుపరచాలని సూచించారు. ప్రజాప్రతినిధులు సమీక్షలో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని నిర్దిష్ట కార్యాచరణగా మార్చాలని, తదుపరి సమీక్షలో చర్యల నివేదికలను సమర్పించాలని స్పష్టం చేశారు. "భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ సమస్యల కారణంగా ఎక్కడైనా నీటిపారుదల ప్రాజెక్టు నిలిచిపోతే వెంటనే ప్రతిపాదనలు పంపాలి. నిధులకు ప్రాధాన్యత ఇస్తాం. ప్రాజెక్టులను పూర్తి చేసి, ఉద్దేశించిన ఆయకట్టుకు ఎలాంటి జాప్యం లేకుండా నీటిని అందించడమే మా లక్ష్యం" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# జల ఉద్యమం వస్తుంది..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** సీఎం రేవంత్ రెడ్డి దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ మాత్రమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చిట్ చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ... జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాను ఒప్పుకున్నారా? ఈ సమావేశానికి హాజరవుతారా? హాజరైతే తెలంగాణ ప్రజల తరఫున ఏం చెప్తారు? అనేదానిపై ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్థాయిలో ఈ జల ఉద్యమం వస్తుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ నీటి హక్కులకు మించిన మరో ప్రాధాన్యత తమ పార్టీకి లేదని, నదీ జలాల్లో కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే ఎజెండాను ఒప్పుకొని ఎలా మీటింగ్‌కి హాజరవుతారని ప్రశ్నించారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అంటూ మండిపడ్డారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? అంటూ ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని వ్యాఖ్యానించారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతోందని చెప్పారు. ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. నదుల నుండి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తిపోసుకుంటే... ముఖ్యమంత్రికి కనీసం సోయి లేదని విమర్శించారు. యాగాలు చేస్తే తప్పు లేదు కానీ... యాగాలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రికి తన బాధ్యతలు నిర్వహించాలని అన్నారు. రేవంత్ రెడ్డికి పంపులు ఎప్పుడు ఆన్ చేయాలి, నీళ్లు ఎప్పుడు ఎత్తిపోయాలో కనీస అవగాహన లేదని విమర్శించారు. పాలమూరు జిల్లా బిడ్డ అని చెప్పుకునే రేవంత్ కనీసం అక్కడికి చెరువులలో నీళ్లు నింపడానికి కూడా సోయి లేదన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పైన తెలంగాణకు నష్టం జరిగేలా ఆంధ్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను అంగీకరిస్తున్నారా లేదా అన్నది కాంగ్రెస్ ఇప్పటిదాకా స్పష్టం చేయలేదన్నారు. క్షుద్రపూజలు అని చెప్పి కాంగ్రెస్ క్షుద్ర రాజకీయాలు చేస్తోందన్నారు. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటామని చెప్పారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్ లను ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని విమర్శించారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ఒక హైకోర్టు ప్రభుత్వాన్ని హైడ్రా విషయంలో అభిశంసన ఇచ్చిన తీరుగా ఎప్పుడూ చేయలేదన్నారు. ప్రభుత్వ అధికారులపైన నమ్మకం లేదు, ఆర్మీని రంగంలోకి దించుతామని అంత ఘాటుగా ఎప్పుడూ చెప్పలేదని వ్యాఖ్యానించారు. పేదలను కొట్టి పెద్దవాళ్లకు దోచిపెట్టడమే హైడ్రా ద్వారా రేవంత్ రెడ్డి చేస్తున్న పని అంటూ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇచ్చిందా? అని ప్రశ్నించారు.

# భారత్ స్వతంత్ర వైఖరిని కొనసాగించాలి




**హిమాయత్ నగర్,ఫ్లాష్ ఇండియా :** దేశ స్వతంత్రత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంతో పాటు అంతర్జాతీయ వ్యవహారాల్లో స్వతంత్ర వైఖరిని కొనసాగించాల్సిన అవసరం ఉందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం ( (ఇస్కఫ్) జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా, హిమాయత్ నగర్, అమృత ఎస్టేట్స్, ఇస్కఫ్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం "ఇరాన్‌పై అమెరికా యుద్ధం – భారత్‌పై ప్రభావం" అనే అంశంపై ఇస్కఫ్ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో సయ్యిద్ అజీజ్ పాషా తో పాటు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రొ. కె. నాగేశ్వర్, మంగోలియా మాజీ భారత రాయబారి టి. సురేష్, ఇస్కఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ పదిహరి, రాష్ట్ర అధ్యక్షులు కాదారు ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి ఆర్. గోపాల్, ఉపాధ్యక్షులు పి.వి. దుర్గాప్రసాద్, కోశాధికారి ఏ. విజయలక్ష్మి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... భారతదేశ విదేశాంగ విధానంలో ఒకప్పుడు కీలకంగా ఉన్న నాన్ అలియెన్డ్ మూమెంట్ (అలీన) విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. అజీజ్ పాషా మాట్లాడుతూ ఇతర దేశాలతో సాంస్కృతిక, సామాజిక సంబంధాలను బలోపేతం చేయడం, వివిధ దేశాల కళలు, సాహిత్యం సాంస్కృతిక విలువలను పరస్పరం పంచుకోవడం, ప్రపంచ శాంతి, సద్భావన, సమైక్యత కోసం ప్రజలను ఐక్యం చేయడమే 'ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో–ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్' (ఇస్కఫ్) లక్ష్యం అని ఆయన తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్రస్థాయిలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. అదే సమయంలో మిగిలిన 32 జిల్లా కేంద్రాల్లోనూ మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లకు తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**కలెక్టర్లకు బాధ్యతలు:**

జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళిక, సమన్వయం, అమలు బాధ్యతను కలెక్టర్లకు అప్పగించారు. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసు శాఖలతో పాటు ఇతర సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. పంపిణీ కేంద్రాల వద్ద వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని, లబ్ధిదారులకు ఎదురయ్యే ఇబ్బందులను అక్కడికక్కడే పరిష్కరించేందుకు 'ప్రత్యేక గ్రీవెన్స్ సెల్' ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించి, రోజూ జరిగే పంపిణీ పురోగతి వివరాలను పౌరసరఫరాల కమిషనర్‌కు నివేదించాలని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరినీ అధికారికంగా ఆహ్వానించి, కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు.





**1.05 కోట్ల కుటుంబాలకు లబ్ధి:**

ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా 16.32 లక్షల రేషన్ కార్డులను మంజూరు చేయడంతో, రాష్ట్రంలో మొత్తం కార్డుల సంఖ్య 1.05 కోట్లకు చేరింది. దీంతో మొత్తం 3.42 కోట్ల మందికి ఆహార భద్రత లభిస్తోంది. ప్రతి నెల సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచి, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సురక్షితమైన, ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం సిద్ధం చేసింది.

## సంపాదకీయం

# ఆశావహుల ఎదురుచూపులు!



తెలంగాణ కాంగ్రెస్‌లో చాలాకాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ మరోసారి వాయిదా పడే సూచనలు కనిపిస్తున్నాయి. పదవుల కోసం ఆశావహులు ఎదురుచూస్తుండగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియ మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీ వర్గాల అంచనా ప్రకారం.. సీఎం విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన తర్వాతే నామినేటెడ్ పోస్టుల భర్తీపై తుది కసరత్తు జరిగే అవకాశం ఉంది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 17 నుంచి 24 వరకు ఇంగ్లాండ్‌లో పర్యటించనున్నారు. అనంతరం ఈ నెల 24న అమెరికాకు వెళ్లే అవకాశం ఉంది. వచ్చే నెల రెండో వారంలో ఆయన రాష్ట్రానికి తిరిగి వచ్చే అవకాశాలున్నట్లు సమాచారం. అయితే పర్యటనకు సంబంధించిన ఖచ్చితమైన తేదీలు ఇంకా పూర్తిగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పోస్టుల భర్తీపై కూడా సీఎం తిరిగి వచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.వాస్తవానికి రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీపై కొంతకాలంగా కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోంది. ముందుగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పదవులను భర్తీ చేస్తారని అంచనాలు వినిపించాయి. అయితే ఎస్ఐఆర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తిగా నిమగ్నమై ఉన్న సమయంలో పదవుల భర్తీ చేపడితే.. ఆశావహులంతా పార్టీ కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడుతుందని అధిష్ఠానం భావించినట్లు సమాచారం.పదవుల కోసం పోటీ పెరిగితే ఎస్ఐఆర్ ప్రక్రియపై దృష్టి మరలే అవకాశం ఉందన్న కారణంతో.. ముందుగా ఆ ప్రక్రియను పూర్తి చేయాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఎస్ఐఆర్ తుది దశకు చేరుకున్నప్పటికీ.. సీఎం విదేశీ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో హడావుడిగా పేర్లపై చర్చించడం, ఆమోదం పొందడం సాధ్యం కాదన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తవవుతోంది.అంటే.. ఒక కారణం ముగిసేలోపే మరో కారణం తెరపైకి రావడంతో నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశం మళ్లీ వాయిదా పడినట్లే కనిపిస్తోంది.మొదట కొన్ని పోస్టులైనా భర్తీ చేయాలన్న ఆలోచన ఉన్నప్పటికీ.. ఇప్పుడు అన్ని ఖాళీలను ఒకేసారి భర్తీ చేయడమే మంచిదన్న అభిప్రాయం బలపడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కుల సంఘాల కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ల నియామకంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టే అవకాశం ఉంది.అయితే ఇది కేవలం పదవుల పంపకం కాదు. ప్రతి నియామకం వెనుక సామాజికవర్గం, జిల్లా, నియోజకవర్గం, పార్టీకి చేసిన సేవ, పాత–కొత్త నాయకుల సమీకరణం వంటి అనేక అంశాలు కీలకంగా మారనున్నాయి.ఒకరికి పదవి ఇస్తే మరో వర్గం నుంచి అభ్యంతరం రాకుండా చూడటం.. ఒక జిల్లాకు ప్రాధాన్యం ఇస్తే మరో జిల్లాకు సమతుల్యత కల్పించడం.. పాత నాయకులను సంతృప్తిపరుస్తూనే కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి కూడా అవకాశం కల్పించడం.. కాంగ్రెస్ నాయకత్వానికి ఇదే అసలు సవాలుగా మారనుంది.నామినేటెడ్ పోస్టుల భర్తీలో పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆలోచన కాంగ్రెస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమికంగా 60 శాతం పదవులను పాతవారికి, పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన వారికి.. 40 శాతం పదవులను కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి ఇవ్వాలన్న ఫార్ములాపై చర్చ జరిగినట్లు సమాచారం.ఈ లెక్క రాజకీయంగా కూడా ప్రాధాన్యమే. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీకి పనిచేసిన సీనియర్లలో అసంతృప్తి పెరగకుండా వారికి పదవులు ఇవ్వాల్సిన అవసరం కాంగ్రెస్ నాయకత్వంపై ఉంది. అదే సమయంలో ఎన్నికల ముందు పార్టీలో చేరి విజయం కోసం పనిచేసిన కొత్త నాయకులను కూడా విస్మరించలేని పరిస్థితి.అందుకే 60:40 ఫార్ములా ద్వారా రెండు వర్గాల మధ్య సమతుల్యత సాధించాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.నామినేటెడ్ పోస్టుల భర్తీలో సామాజిక న్యాయం కూడా కీలక అంశంగా మారనుంది. ఇప్పటికే జిల్లాలు, నియోజకవర్గాల స్థాయి నుంచి అర్హులైన ఆశావహుల పేర్లను పార్టీ సేకరించినట్లు సమాచారం. వాటిలో కొంతమేర వడపోత కూడా పూర్తయినట్లు తెలుస్తోంది.ముఖ్యంగా మహిళా చైర్మన్లు, డైరెక్టర్లకు సంబంధించిన జాబితా దాదాపు సిద్ధంగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే విషయంలోనూ నాయకత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నట్లు సమాచారం.ఇక్కడే కాంగ్రెస్‌కు అసలు రాజకీయ పరీక్ష మొదలవుతుంది. సామాజిక న్యాయం పేరుతో పదవులు కేటాయించాలి.. అదే సమయంలో ప్రాంతీయ సమతుల్యతను కాపాడాలి. పార్టీకి విధేయంగా ఉన్నవారికి న్యాయం చేయాలి.. కొత్తగా వచ్చిన వారిని కూడా దూరం చేయకూడదు. ఈ సమీకరణాలన్నింటినీ కలిపి తుది జాబితా రూపొందించడం అంత సులభమైన వ్యవహారం కాదు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ కార్పొరేషన్లకు నియమించిన చైర్మన్ల పదవీకాలం ఇటీవల ముగిసింది. దీంతో ఇప్పుడు పాతవారినే కొనసాగిస్తారా? లేక కొత్తవారికి అవకాశం కల్పిస్తారా? అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.పాతవారిని కొనసాగించాలంటే ఎంత మందిని కొనసాగించాలి? ఏ ప్రాతిపదికన ఎంపిక చేయాలి? పార్టీకి వారి సేవలు ఎంతవరకు ఉపయోగపడ్డాయి? అనే అంశాలు కూడా పరిశీలనలోకి రానున్నాయి.ఇక కొన్ని కార్పొరేషన్లకు కొత్త చైర్మన్లను నియమించాల్సి ఉండగా.. మరికొన్ని చోట్ల డైరెక్టర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. దీనికి తోడు పార్టీ సంస్థాగత పదవుల భర్తీ కూడా పెండింగ్‌లో ఉంది.అంటే ఒకేసారి భారీ స్థాయిలో రాజకీయ నియామకాలు చేపట్టాల్సిన పరిస్థితి కాంగ్రెస్ నాయకత్వం ముందుంది.పదవుల కోసం ఎదురుచూస్తున్న నాయకులకు మాత్రం ప్రతి వాయిదా ఒక కొత్త ఉత్కంఠను సృష్టిస్తోంది. ఇప్పటికే జిల్లాలు, నియోజకవర్గాల నుంచి పేర్లు వెళ్లడం.. కొంత వడపోత జరగడం.. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించిన జాబితాలపై కసరత్తు జరుగుతుండటంతో.. తమకు అవకాశం వస్తుందన్న ఆశతో అనేక మంది నాయకులు ఎదురుచూస్తున్నారు.అయితే సీఎం విదేశీ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఆశావహుల నిరీక్షణ మరికొంత కాలం కొనసాగాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.రాజకీయాల్లో పదవి అనేది కేవలం ఒక హోదా కాదు. అధికార పార్టీలో అది భవిష్యత్ రాజకీయ ప్రాధాన్యానికి ఒక సంకేతం. అందుకే ప్రతి చైర్మన్, ప్రతి డైరెక్టర్ పోస్టు వెనుక పెద్ద రాజకీయ లెక్కే ఉంటుంది.గత కొంతకాలంగా నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చ జరుగుతున్నప్పటికీ.. ఏదో ఒక కారణంతో నిర్ణయం వాయిదా పడుతూ వస్తోంది. ఇప్పుడు ఎస్ఐఆర్ ప్రక్రియ తుది దశకు చేరుకోవడం, సీఎం విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి రావడం పూర్తయితే.. వచ్చే నెలలో నియామక ప్రక్రియకు కదలిక వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.అయితే అసలు ఆసక్తి ఎప్పుడు భర్తీ చేస్తారన్నదానికంటే.. ఎవరికి ఏ పదవి దక్కుతుంది? ఎవరిని పక్కన పెడతారు? పాతవారికి ఎంత ప్రాధాన్యం ఉంటుంది? కొత్తవారికి ఎంత అవకాశం ఇస్తారు? సామాజిక సమీకరణాల్లో ఏ వర్గానికి ఎంత ప్రాతినిధ్యం లభిస్తుంది? అన్నదానిపైనే ఉంది.మొత్తానికి.. కాంగ్రెస్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ ఇప్పుడు కేవలం పరిపాలనా ప్రక్రియగా కాకుండా, పార్టీ భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు దిశానిర్దేశం చేసే కీలక నిర్ణయంగా మారుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత ఈ రాజకీయ పజిల్‌కు ఎలాంటి పరిష్కారం చూపుతారన్నదే ఇప్పుడు పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ.

# కమ్మేస్తున్న డ్రగ్స్ భూతం...

హైదరాబాద్, బెంగళూరు వంటి పది నగరాల్లోని పాఠశాల విద్యార్థులపై ఢిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన సర్వే ఒక చేదు వాస్తవాన్ని వెల్లడించింది. 12, 13 ఏళ్ల నుంచే పలువురు పిల్లలు మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు అది స్పష్టం చేసింది. కొన్ని ప్రాంతాల్లో ఏడేళ్లనుంచే పిల్లలు వాటికి అలవాటుపడుతుండటం ఇంకా ఎక్కువగా కలవరపరుస్తోంది. ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కళాశాలలూ వర్సిటీల్లోనూ డ్రగ్స్ రాకాసి స్వైరవిహారం తరచూ బయటపడుతూ దేశ భవిష్యత్తుపై భయాందోళనలు రేపుతోంది.తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య ఇంతింతై వటుడింతై అన్నట్టుగా విస్తరిస్తోంది. మొదట్లో హైదరాబాద్ కు మాత్రమే పరిమితం అనుకున్న డ్రగ్స్ ఇప్పుడు.. ఎడాపెడా ఎక్కడపడితే అక్కడ పట్టుబడుతున్నాయి. చివరకు డ్రగ్స్ పెడ్లర్లలో డాక్టర్లు, టీచర్లు, విద్యార్థులు కూడా ఉండటం అందర్నీ అవాక్కయ్యేలా చేస్తోంది. అంతకుముందు పబ్బులు, క్లబ్బుల్లో మాత్రమే డ్రగ్స్ దందా జరుగుతోందనే భ్రమలో ఉన్న అధికారులకు.. ఇటీవలి కేసులు కళ్లు తెరిపిస్తున్నాయి. ఉదాహరణకు వీకెండ్‌లో డాక్టర్లంతా ఓ చోట కలుస్తుంటారు. అది పైకి సాధారణ గెట్‌టుగెదర్‌లాగే ఉంటుంది. కానీ పొరపాటున పోలీసులొస్తే.. వారంతా కంగారు పడతారు. పరారవటానికి ప్రయత్నిస్తారు. అలాంటి సందర్భాల్లో డాక్టర్ల దగ్గర డ్రగ్స్ దొరకటం చూసి పోలీసులు విస్తుపోతున్నారు. అదే సమయంలో స్కూలు బ్యాగ్‌లు, కాలేజీ క్యాంటీన్లలో డ్రగ్స్ పట్టుబడే కల్చర్ కూడా బాగా పెరిగిపోయింది. ఇప్పటికే చాలాసార్లు విద్యాసంస్థల యాజమాన్యాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చినా.. ప్రతి విద్యార్థిని 24 గంటలు తాము మాత్రం ఎలా గమనించగలమని అవి చేతులెత్తేశాయి. చివరకు క్యాంపస్‌లో డ్రగ్స్ దొరక్కుండా జాగ్రత్తపడుతున్నాయి. కానీ డ్రగ్స్ మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు ఏదో మార్గంలో డ్రగ్స్ తీసుకుంటూనే ఉన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం.. డ్రగ్స్ చాక్లెట్లు, డ్రగ్స్ సిగరెట్లు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అధికారులు డ్రగ్స్‌కు ఓ తలుపు మూసేస్తే.. మరో నాలుగు తలుపులు తెరుచుకుంటున్నాయి. అందుకే టాస్క్ ఫోర్స్, ఈగల్ పేరుతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినా.. అనుకున్న స్థాయిలో డ్రగ్స్‌ను కట్టడి చేయడం సాధ్యం కావడం లేదు.విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్లు..చేయాల్సిన పని వదిలిపెట్టి స్టూడెంట్స్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. కేరళలోని వడకరలో రెండ్రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన MDMA రవాణలో కేసులో ముగ్గురు టీచర్లతో సహా ఓ డెలివరీ బాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.దర్యాప్తులో భాగంగా నిందితుల వాట్సాప్ మేసేజ్ లు, బ్యాంకు అకౌంట్ల ట్రాన్సాక్షన్లు పరిశీలించిన పోలీసులు..డ్రగ్స్ సరఫరా వెనుక కింగ్ పిన్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన టీచర్లు ఇలాంటి అక్రమాలకు పాల్పడటం, డబ్బు కోసం అడ్డదారులు తొక్కడం వారి వ్యక్తిగత జీవితాలనే కాదు.. యువత భవిష్యత్తును కూడా నాశనం చేస్తుంది. ఇలాంటి ఘటనలు వృత్తి గౌరవాన్ని, నైతిక బాధ్యతను గుర్తుచేస్తున్నాయి.సరదాకో, స్నేహితుల ప్రోద్బలంతోనో గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు చేరువై క్రమంగా ఆ ఊబిలో కూరుకుపోతున్నవారిలో చాలామంది మానసిక రుగ్మతలు మొదలు గుండెజబ్బులు, క్యాన్సర్ల వంటి ప్రాణాంతక వ్యాధులను కొనితెచ్చుకుంటున్నారు. డ్రగ్స్ కొనుగోలుకు కావాల్సిన డబ్బుకోసం వాటి విక్రయానికి సిద్ధపడుతున్నారు. దొంగతనాలు, దోపిడీలకూ తెగబడుతున్నారు. గంజాయి మత్తు తలకెక్కి రాత్రిళ్లు వీధుల్లో గొడవలకు దిగుతూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. జీవితాలు అల్లకల్లోలమై ఆఖరికి ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. కాసుల యావతో జాతి భవితవ్యాన్ని చీకట్లోకి నెడుతున్న డ్రగ్స్ కింగ్ పిన్లకు త్వరగా శిక్షలు పడకపోతుండటం వల్లే డ్రగ్స్ వెల్లువకు అడ్డుకట్టవేయడం సాధ్యపడట్లేదు.ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2022–24 మధ్య దేశవ్యాప్తంగా మూడు లక్షల కేసులు నమోదయ్యాయి. 3.75 లక్షల మంది అరెస్టయ్యారు. కానీ, 268 మందికే శిక్షలు పడ్డాయి. తనిఖీలు, నమూనాల జప్తు, తరలింపుల్లో లోపాలు, ఫోరెన్సిక్ పరీక్షల్లో ఆలస్యం వంటివి దుర్మార్గులకు వరవవుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో ప్రత్యేక ఎన్‌డీపీఎస్ కోర్టులు లేకపోవడం వల్లా కేసుల మేటలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం సంబంధిత కేసులు నాలుగు లక్షల వరకు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ వీలైనంత త్వరగా కొలిక్కి రావాలంటే– అవసరానికి తగినట్లు అన్నిచోట్లా స్పెషల్ కోర్టులను ఏర్పాటుచేయాలి. డ్రగ్స్ కేసుల దర్యాప్తులో సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. మాదకమూకల పీచమణచడంలో అన్ని రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. అన్నింటికన్నా ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉంటూ, వారి ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిణామాలపై విద్యార్థులకు అనునిత్యం అవగాహన కల్పిస్తూ, వారిని సరైన దారిలో నడిపించాలి. లేకపోతే భావి భారతం మనం ఊహించలేనంత ప్రమాదకరంగా మారుతుందని చెప్పటానికి సంకోచించాల్సిన పని లేదు.ఈ కారణంగానే ఐఐటీ , ఐఐఎంలతో సహా దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పెరుగుతున్న డ్రగ్ కల్చర్ కు చెక్ పెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఐఐటీ, ఐఐఎంలతో ప్రారంభించి అన్ని ఉన్నత విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలోనే స్వచ్ఛంద డ్రగ్స్ టెస్టులు నిర్వహించబోతున్నారు. ఈ మేరకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఆయా సంస్థల్లో అడ్మిషన్లు కోరే అభ్యర్థులు తమ అడ్మిషన్ పత్రాలతో పాటు యాంఫెటమైన్లు, కొకైన్, గంజాయి, బెంజోడయాజెపైన్లు, ఫెన్సైక్లిడిన్ వంటి మాదకద్రవ్యాల నిర్ధారణకు స్వచ్ఛందంగా యూరిన్ టెస్ట్ చేయించుకోవాలి. కేంద్ర విద్యా శాఖకు చెందిన ఉన్నత విద్యా విభాగం చేపట్టిన ఈ కార్యక్రమం, దేశంలో మాదకద్రవ్యాల సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా చెప్తున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాదకద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్ 2026–29లో దీన్ని జత చేశారు. దీని ప్రకారం వచ్చే మూడేళ్లలో కేంద్ర నిధులతో నడిచే 170 ఉన్నత విద్యా సంస్థలలోని సుమారు 10 లక్షల మంది విద్యార్థులకు దశలవారీగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తారు.2029 నాటికి 10 లక్షల మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై పరీక్షలు నిర్వహించే మిషన్ ను ప్రధాని మోడీ ఆగస్టు 2న ప్రారంభించారు. దీనికి నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌గా పేరు పెట్టారు. ఢిల్లీ ఎయిమ్స్ లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ ఈ మేరకు కాలేజీలు, వర్సిటీల విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల కోసం మార్గదర్శకాలు ఇచ్చింది. ఇందులో డ్రగ్స్ పరీక్ష పూర్తిగా స్వచ్ఛందంగా, గోప్యంగా ఉండాలని, పరీక్ష చేయించుకునే విద్యార్థులపై ఎటువంటి ప్రతికూల పరిణామాలకు దారితీయకూడదని, దీనిని కేవలం కౌన్సెలింగ్ ప్రయోజనాల కోసం మాత్రమే ఉంచాలని సూచించింది. ఈ డ్రగ్ పరీక్షల కార్యక్రమం మూడు దశల్లో అమలు చేస్తారు. మొదటి దశలో ఈ ఏడాది ఐఐటీలు, ఐఐఎంలు, ఒక సెంట్రల్ యూనివర్శిటీలో చేపడతారు. వచ్చే ఏడాది 32 ఎన్ఐటీలు, ఎనిమిది ఐఐఎస్ఈఆర్ లు, మూడు ఎస్పీఏలు, 25 ట్రిపుల్ ఐటీలు, కేంద్ర నిధులతో నడిచే నాలుగు జేఎన్టీయూల్లో చేపడతారు. ఆ తర్వాత 2028–29లో 46 సెంట్రల్ యూనివర్సిటీలు ,నాలుగు డీమ్డ్–టు–బి విశ్వవిద్యాలయాలకు వీటిని విస్తరిస్తారు. డ్రగ్స్ తాత్కాలిక ఉత్తేజాన్ని ఇవ్వొచ్చు కానీ...అవి జీవితం మొత్తాన్నీ నాశనం చేస్తాయని ప్రధాని మోడీ యువతను హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఈ మేరకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.తమ పిల్లలు బుద్ధిమంతులనీ వారికి ఎలాంటి దురలవాట్లూ లేవనీ తల్లిదండ్రులు నమ్ముతారు. పిల్లల్ని నమ్మడం మంచిదే కానీ పరిస్థితులని నమ్మలేం కాబట్టి అప్రమత్తంగా ఉండడం అవసరం. టీనేజర్లు తల్లిదండ్రుల కళ్లు కప్పి సిగరెట్ కాల్చాలని ప్రయత్నించడం, మద్యంతో ప్రయోగాలు చేయడం సహజం. ఇప్పుడు మరొకడుగు ముందుకేసి ఏకంగా మత్తుతోనే చెలగాటమాడుతున్నారు. చాలా రకాల పరిస్థితులు అందుకు దారితీస్తున్నాయంటున్నారు నిపుణులు. ఉద్యోగవ్యాపారాల్లో బిజీగా ఉండి పిల్లల్ని పట్టించుకోకపోవడం అన్నిటికన్నా పెద్ద కారణం. అవసరానికి మించి స్వేచ్ఛా డబ్బూ అందుబాటులో ఉండడం వారిని తప్పుదారి పట్టేలా చేస్తోందనీ అంటున్నారు. పిల్లలు డ్రగ్స్ తీసుకోవటానికి అలవాటు పడ్డాక, డబ్బు కోసం దొంగతనాలకు పాల్పడడం మొదలెడితే అప్పుడు కానీ తల్లిదండ్రులకు తెలియడం లేదు. కాబట్టి ఎవరి పిల్లల గురించి వారే మొదట జాగ్రత్తలు తీసుకోవాలి. స్కూళ్లు, కాలేజీల నుంచి టైంకి ఇంటికొస్తున్నారా.. లేదా..? బ్యాగుల్లో ఏం తీసుకెళ్తున్నారు..? ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారు..? లాంటి కనీస జాగ్రత్తలు పాటించటం అత్యవసరమని నిపుణులతో పాటు ప్రభుత్వాలు కూడా సూచిస్తున్నాయి. ఎందుకంటే ప్రతి ఇల్లు డ్రగ్స్ రహితం కావాలనే సంకల్పం తీసుకుంటే.. ఆటోమేటిగ్గా హైదరాబాద్, తెలుగు రాష్ట్రాలు కూడా డ్రగ్స్ రహితం కావడం పెద్ద కష్టం కాదు. చివరిగా దేశం కూడా డ్రగ్స్ నుంచి విముక్తం అవుతుంది.

# ఉత్తమ ఉపాధ్యాయులకే పురస్కారాలు..



ఉపాధ్యాయ వృత్తి మిగతా వృత్తులకంటే భిన్నమైనది. ఒక వైద్యుడు ఒకరి ప్రాణాన్ని కాపాడగలడు.. ఒక ఇంజనీర్ ఒక నిర్మాణాన్ని నిలబెట్టగలడు.. కానీ ఒక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్నే మార్చగలడు. అందుకే “గురుదేవో భవః” అనే మాటకు భారతీయ సమాజంలో అంతటి ప్రాధాన్యం వచ్చింది. తరగతి గదిలో చెప్పే ఒక మాట, ఇచ్చే ఒక సలహా, చూపించే ఒక మార్గం.. విద్యార్థి భవిష్యత్తును నిర్ణయించే స్థాయిలో ప్రభావం చూపుతాయి. అలాంటి ఉపాధ్యాయుల సేవలను గుర్తించడం, గౌరవించడం సమాజం బాధ్యత.ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను పురస్కారాలతో సత్కరించడం మంచి సంప్రదాయం. అయితే ఇక్కడే ఒక కీలకమైన ప్రశ్న ఎదురవుతోంది. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక నిజంగా ప్రతిభ ఆధారంగానే జరుగుతోందా? లేక పరిచయాలు, పైరవీలు, రాజకీయ పలుకుబడి, సంస్థాగత సిఫారసులు కూడా ప్రభావం చూపుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.పురస్కారం అనేది కేవలం ఒక సర్టిఫికెట్ లేదా శాలువా కాదు. అది ఒక ఉపాధ్యాయుడి సేవలకు సమాజం ఇచ్చే గుర్తింపు. అందుకే ఆ గుర్తింపు విలువను తగ్గించే ఏ చర్య అయినా ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్నే దెబ్బతీస్తుంది. నిజంగా ఉత్తమ ఉపాధ్యాయుడిని ఎంపిక చేయాలంటే కాగితాలపై ఉన్న వివరాలు, సిఫారసు లేఖలు మాత్రమే కాకుండా క్షేత్రస్థాయి పనితీరును పరిశీలించాలి.ఆ ఉపాధ్యాయుడు పాఠశాలకు ఎంత సమయం కేటాయిస్తున్నారు? విద్యార్థుల అభ్యసన సామర్థ్యం ఎలా పెరిగింది? పేద, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏమైనా చేస్తున్నారు? పాఠశాల అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంత? సమాజంతో పాఠశాలకు ఉన్న అనుబంధాన్ని బలోపేతం చేస్తున్నారా? విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు మానవీయ విలువలను పెంపొందిస్తున్నారా? వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.అదే సమయంలో బోధనకు దూరంగా ఉంటూ, పాఠశాల విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ, కేవలం పురస్కారం కోసం పైరవీలు చేసుకునే వారికి అవార్డులు ఇవ్వడం సరికాదు. అలాంటి ఎంపికలు నిజాయితీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీస్తాయి. “ఎంత కష్టపడ్డా గుర్తింపు రాదు.. పరిచయాలు ఉంటే చాలు” అనే భావన ఉపాధ్యాయుల్లో ఏర్పడితే అది విద్యా వ్యవస్థకు ప్రమాదకరం.సోషల్ మీడియాలో కూడా ప్రతి సంవత్సరం పురస్కారాల సమయంలో ఇలాంటి అంశాలపై చర్చ జరుగుతోంది. అవార్డు అందుకున్న వారి కంటే, అవార్డుకు అర్హత ఉన్నా గుర్తింపుకు దూరమైన ఉపాధ్యాయుల గురించి మాట్లాడే సందర్భాలు కనిపిస్తున్నాయి. ఇది కేవలం సోషల్ మీడియా చర్చగా చూడకుండా.. వ్యవస్థలో పారదర్శకతపై వస్తున్న సామాజిక ప్రశ్నగా చూడాలి.పురస్కారాల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పెంచాలి. విద్యార్థులు, తల్లిదండ్రులు, సహచర ఉపాధ్యాయుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా పురస్కారం కోసం ప్రయత్నించని, ప్రచారానికి దూరంగా ఉంటూ నిశ్శబ్దంగా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతున్న గురువులను గుర్తించడం అత్యంత ముఖ్యమైన విషయం.ఎందుకంటే ఉత్తమ ఉపాధ్యాయుడి గొప్పతనం ఆయన అందుకున్న అవార్డులో ఉండదు.. ఆయన వల్ల మారిన విద్యార్థుల జీవితాల్లో ఉంటుంది. అలాంటి గురువులను వెతికి, గుర్తించి, గౌరవించినప్పుడే ఉపాధ్యాయ పురస్కారాలకు నిజమైన గౌరవం దక్కుతుంది.అవార్డులు అందరికీ ఇవ్వొచ్చు.. కానీ “ఉత్తమ ఉపాధ్యాయుడు” అనే గౌరవం మాత్రం ఉత్తములకే దక్కాలి. గురువును గౌరవించడం అంటే.. భవిష్యత్తును గౌరవించడం.

# డయాగ్నస్టిక్ మాయ..

## లైసెన్స్ ఒకరిది నిర్వహణ మరొకరిది!

**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన డయాగ్నస్టిక్ ల్యాబ్‌ల నిర్వహణలో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. లైసెన్స్ ఒకరి పేరుతో ఉండగా, నిర్వహణ మరొకరు చేస్తున్న ఘటనలు జిల్లా వ్యాప్తంగా కనిపిస్తున్నాయి. అనుభవం లేని వారితో టెస్టులు చేస్తూ డబ్బులు దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినా వైద్యాధికారుల పర్యవేక్షణ కొరవడిందని తెలుస్తోంది. జిల్లాలోని చాలా ప్రైవేట్ ల్యాబ్‌లు, దయాగ్నాస్టిక్ సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. లైసెన్స్ ఉన్న వైద్యుడు లేదా టెక్నీషియన్ పేరుతో రిజిస్ట్రేషన్ తీసుకుని, వాస్తవంగా మాత్రం అనుభవం, అర్హత లేని వ్యక్తులు నిర్వహిస్తున్నారు. కమీషన్ల ఆధారంగా రోగులను ఆకర్షించి పరీక్షలు చేయిస్తున్నారు. తనిఖీల సమయంలో మాత్రమే లైసెన్స్ ఉన్న వ్యక్తి కనిపించి, మిగిలిన రోజుల్లో కనిపించకుండా పోతున్నారు. చాలా ల్యాబ్‌ల్లో డీఎంఎల్టీ, బిఎమ్ఎల్టీ అర్హత లేని సిబ్బందిని పెట్టి రక్త, మూత్ర పరీక్షలు చేయిస్తున్నారు. ట్రైనింగ్ లేకుండానే మిషన్లు ఆపరేట్ చేసి రిపోర్టులు ఇస్తున్నారు. దీంతో తప్పుడు రిపోర్టులు వచ్చి రోగులు తప్పుడు చికిత్స తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల ఒకే సిబ్బంది కౌంటర్, శాంపిల్ కలెక్షన్, రిపోర్ట్ తయారీ అన్ని పనులు చేస్తున్నారు. జిల్లాలోని కొందరు ప్రముఖ వైద్యులు గ్రూపులుగా ఏర్పడి దయాగ్నస్టిక్ సెంటర్లు పెట్టారు. తమ క్లినిక్‌లకు వచ్చే రోగులను తాము పెట్టిన ల్యాబ్‌లకే పంపి 30-40శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నారు. దీంతో అనవసర పరీక్షలు కూడా చేయించేలా రోగులను ప్రోత్సహిస్తున్నారు. నాణ్యత కంటే లాభమే లక్ష్యంగా ఈ సిండికేట్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయి.

**విచ్చలవిడిగా డబ్బులు వసూళ్లు..**

కొన్ని దయాగ్నస్టిక్స్ సెంటర్లు ల్యాబ్ ల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన రేట్లను పాటించడం లేదు. ఫుల్ బాడీ ప్యాకేజీ పేరుతో అవసరం లేని 70-80 రకాల పరీక్షలు కలిపి వేలల్లో బిల్లు వేస్తున్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు అప్పులు చేసి అయినా టెస్టులు చేయించుకుంటున్నారు. డిస్కౌంట్ అంటూ ఆకర్షించి, చివరకు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

**పట్టించుకోని వైద్యశాఖ..**

ల్యాబ్‌లపై ఫిర్యాదులు వస్తున్నా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సరైన తనిఖీలు చేయడం లేదు. లైసెన్స్ రెన్యూవల్, అకస్మాత్తు తనిఖీల్లో కూడా నామమాత్రంగానే పరిశీలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో అక్రమాలు రోజు-రోజుకూ పెరుగుతున్నాయి.

**తప్పుడు రిపోర్టులతో రోగుల ప్రాణాలకు ముప్పు..**

అర్హత లేని సిబ్బంది చేతుల్లో పరీక్షలు జరగడంతో తప్పుడు రిపోర్టులు ఇస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. షుగర్, థైరాయిడ్, కిడ్నీ టెస్టుల్లో తేడాలు వచ్చి రోగులు తప్పుడు మందులు వాడుతున్నారు. కొందరు రోగులు రెండు మూడు ల్యాబ్‌లలో ఒకే టెస్ట్ చేయించి ఫలితాలు వేరుగా రావడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా ఎక్కడ టెస్టులు చేసుకుంటే సరైన రిపోర్టు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

**అధికారుల చర్యలు తీసుకుంటారా..?**

జిల్లాలోని అన్ని ల్యాబ్‌లు, డయాగ్నాస్టిక్ సెంటర్లపై వెంటనే విస్తృత తనిఖీలు చేయాలని, అర్హత లేని సిబ్బందిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘించిన వారి లైసెన్స్‌లను రద్దు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోగుల నుంచి అధికంగా వసూలు చేస్తున్న ఫీజులపై కూడా నియంత్రణ ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య శాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వడ్డీతో సహా రికవరీ..!

## 'డబుల్ శాలరీ' ఉద్యోగులపై సర్కార్ సీరియస్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో నకిలీ ఆధార్ మ్యాపింగ్, ఒకే వ్యక్తి వేర్వేరు పేర్లతో రెండు చోట్ల జీతాలు, వేతనాలు పొందుతున్న అక్రమాలపై ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో క్రమంగా చేపడుతున్న ఆధార్, ఉద్యోగుల వివరాల తనిఖీల్లో డబుల్ శాలరీ స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఒకే ఆధార్ సంఖ్యను ఉపయోగించి వేర్వేరు ప్రభుత్వ శాఖల్లో, కార్యాలయాల్లో రెగ్యులర్, గ్రాంట్-ఇన్-ఎయిడ్, తాత్కాలిక సిబ్బంది పేర్లతో చాలామంది డబుల్ శాలరీలు పొందినట్లు ఆర్థిక శాఖ గుర్తించింది. అక్రమాలకు పాల్పడింది అందరూ రెగ్యులర్ ఉద్యోగులే కావడం గమనార్హం. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఆదేశాలు జారీ చేశారు.

**ప్రభుత్వ ఖజానాకు గండి..**

ఒకే ఆధార్ ఆధారంగా ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ శాఖల ద్వారా జీతాలు, రెమ్యూనరేషన్ పొందడం తీవ్రమైన ఆర్థిక అక్రమమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది ప్రభుత్వ రికార్డులను మోసగించడం, ఆల్టరేషన్/ఫోర్జరీకి పాల్పడటం, నిధుల దుర్వినియోగానికి గురిచేయడం కిందకు వస్తుందని తెలిపింది. అన్ని పరిపాలనా శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు తక్షణమే రంగంలోకి దిగి చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఆర్థిక శాఖ పంపిన ఆధారాల ప్రాతిపదికన మోసపూరితంగా రెండు చోట్ల జీతాలు పొందిన ఉద్యోగులపై తక్షణమే విచారణ జరపాలని స్పష్టం చేసింది. తెలంగాణ సివిల్ సర్వీసెస్ నిబంధనలు--1991 ప్రకారం బాధ్యులపై మేజర్ పెనాల్టీ పడేలా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

**నిధుల రికవరీ, క్రిమినల్ కేసులు..**

అక్రమంగా డ్రా చేసిన పూర్తి జీతం మొత్తాన్ని వడ్డీతో సహా రికవరీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మోసానికి పాల్పడిన వారిపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేయాలని స్పష్టం చేసింది. ఈ డబుల్ జీతాల అక్రమాలకు సహకరించిన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ అంశాన్ని అత్యంత అత్యవసరమైనదిగా పరిగణించి, విచారణ పురోగతి, రికవరీ చేసిన మొత్తం, నమోదు చేసిన క్రిమినల్ కేసులు, శాఖాపరమైన చర్యల వివరాలతో పక్కా నివేదికను 7 రోజుల్లోగా ఆర్థిక శాఖకు సమర్పించాలని ఆదేశించింది. పంచాయతీరాజ్, పురపాలక, పాఠశాల విద్య, ఉన్నత విద్య, పోలీస్, రెవెన్యూ, వ్యవసాయం, వైద్య ఆరోగ్య శాఖలు తక్షణమే ఈ ఆదేశాలను అమలు చేయాలని సీఎస్ స్పష్టం చేశారు.

**డబుల్ శాలరీ తీసుకున్నది వీరే..**

ప్రభుత్వ వివరాల ప్రకారం.. తన్నీరు అన్నపూర్ణ, యూ.ఆనంద్‌కుమార్, దుంపలపల్లి స్వామి, బానోత్ నాగేశ్వర్, తీగల మహేశ్, నీలకంఠం సంతోష్‌కుమార్, కే.గురునాథం, సుంకరి శేఖర్, అద్దంకి ఆనంద్‌కుమార్, చిలుకూరి సుదర్శన్, అనీస్ ఫాతిమా, గంగేరి సందీప్‌కుమార్, పి.వేణుగోపాల్, మహ్మద్ వహీద్ పాషా, రాసమళ్ల సురేష్, జాంబ్రె భరత్, సి.స్వర్ణలత, పెద్ది శ్రీవిద్య, ధరావత్ చంద్రిక, కుమ్మరి నిర్మల, దిడ్డెల శ్రీకాంత్, మునగాల రవిందర్, మహ్మద్ అబ్దుల్ మోక్సిద్, బి.రమేశ్, తంగేళ్ల నరేశ్‌కుమార్ రెడ్డి, చంద్రిబాయి, నిమ్మ ఎన్.ఆర్.సరిత, ఎన్.మదన్, జీ.మోహన్ నాయక్, సానబోయిన కృష్ణయ్య, కోడెం నరసింహ మూర్తి, శ్యాంసుందర్, దేవులపల్లి రమాదేవి, సర్వవల్లి కమల, నీరాడి శంకర్, పొనగొని సైదులు, పి.ఝాన్సీలక్ష్మి, ఎస్.బీ.లావణ్య, కిందింటి మోహన్‌రెడ్డి, డి.ప్రమీలా రాణి పేర్లు జాబితాలో ఉన్నాయి.



## కాంగ్రెస్ కూటమిది కపట నాటకం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళనలు, ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లుపై ఇతర దేశాల జోక్యంపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. ఇవాళ ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. జార్ఖండ్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతుంటే కాంగ్రెస్ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని విమర్శించారు. కాంగ్రెస్, ఇండీ కూటమి కపట పూరితమైన, ద్వంద్వ పాత్రను పోషిస్తున్నాయని ఆరోపించారు. కేరళ లోనూ విద్యార్థులు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని.. కానీ ఇవేమీ రాహుల్ గాంధీకి కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని పరిస్థితులను మాత్రమే స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీ.. జార్ఖండ్‌లోని విద్యార్థుల సమస్యలపై ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. విద్యార్థులను కేవలం తమ రాజకీయ ప్రయోజనాలు, లబ్ధి కోసం మాత్రమే వాడుకోవాలని కాంగ్రెస్ చూస్తోందని ఆయన రాంచందర్ రావు ఆరోపించారు. ఇక విదేశీ విరాళాల నియంత్రణ చట్టం బిల్లుపై విదేశాల జోక్యాన్ని రాంచందర్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. భారత అంతర్గత విషయాల్లో అమెరికా వంటి విదేశాలు జోక్యం చేసుకోవడం ఎంతమాత్రం తగదని అన్నారు. ఇది పూర్తిగా తమ దేశపు అంతర్గత వ్యవహారమని పేర్కొన్నారు. మన చట్టాలపై ఇతర దేశాలు మాట్లాడటం అంటే అది భారత సార్వభౌమాధికారాన్ని సవాలు చేయడమేనని రాంచందర్ రావు ఫైర్ అయ్యారు.

# ఉమ్టా కార్యాచరణ షురూ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** క్యూర్ పరిధిలో ప్రజా రవాణాను బలోపేతం చేయడంతోపాటు ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో వ్యక్తిగత వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఉమ్టా) కార్యాచరణ రూపొందించింది. అందులో భాగంగానే రోడ్డుపై వెళ్లే బస్సులు, కార్లు, మోటార్ సైకిల్స్, పాదచారులకు సమానమైన స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ కార్యాచరణలో భాగంగానే జీహెచ్ఎంసీ పరిధిలో రెండు మోడల్ కారిడార్లను రూపొందించనున్నారు. సీఎంసీ పరిధిలో రెండు, ఎంఎంసీ పరిధిలో రెండు మోడల్ కారిడార్లను త్వరలోనే గుర్తించనున్నారు.

**మోడల్ కారిడార్లు ఇలా..**

క్యూర్ పరిధిలో ఆరు మోడల్ కారిడార్లను డెవలప్ చేయాలని నిర్ణయించిన ఉమ్టా మొదటి దశలో జీహెచ్ఎంసీలో మాసబ్ ట్యాంక్ నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్, మాసబ్ ట్యాంక్ నుంచి షేక్‌పేట్ వరకు రెండు కారిడార్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ రెండు మార్గాల్లో జీహెచ్ఎంసీ అధికారులు సర్వే నిర్వహించి ఇంజినీరింగ్ పనులు చేయాల్సి ఉందా? బాటిల్ నెక్స్ ఏమైనా ఉన్నాయా? ఫుట్‌పాత్స్ పరిస్థితి ఎలా ఉంది? జంక్షన్ల నిర్వహణ ఎలా ఉంది? ఆన్ స్ట్రీట్ పార్కింగ్, ఆఫ్ స్ట్రీట్ పార్కింగ్ ఏర్పాటు చేయడానికి అవకాశాలు ఏమైనా ఉన్నాయా? సైకిల్ ట్రాక్స్ ఏర్పాటు చేయడానికి అవకాశముందా? అనే అంశాలను పరిశీలించడంతోపాటు వీటిని వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోనున్నారు. అన్ని రకాల రవాణా మార్గాలకు రోడ్డుపై సమానమైన స్థలాన్ని కేటాయించడానికి ఉమ్టా కసరత్తు చేస్తోంది.

**ఉల్లంఘునులకు చుక్కలే..**

జీహెచ్ఎంసీ పరిధిలో రెండు మోడల్ కారిడార్లలో బస్సు, కార్లు, బైకులు పాదచారులకు ప్రత్యేక ఏరియా ను కేటాయించడంతో పాటు ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరించనున్నారు. ఈ రెండు మార్గాల్లో స్ట్రీట్ వెండింగ్ కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎవరికి కేటాయించిన మార్గాల్లో వారు వెళ్లాల్సిందే.

**పార్కింగ్‌పై ఫోకస్..**

నగరంలో ట్రాఫిక్ సమస్యకు అక్రమ పార్కింగ్ తో పాటు పార్కింగ్ స్థలం లేకపోవడమూ ప్రధాన కారణాలు. వీటిని సైతం పరిష్కరించనున్నారు. 'ఆన్ స్ట్రీట్ పార్కింగ్'లో భాగంగా స్మార్ట్ పార్కింగ్ ఏర్పాటు చేయడానికి జీహెచ్ఎంసీ చర్యలు ప్రారంభించింది. ఖైరతాబాద్ జోన్ పరిధిలో కొన్ని ఏరియాలను గుర్తించిన విషయం తెలిసిందే. 'ఆఫ్ స్ట్రీట్ పార్కింగ్'లో భాగంగా నాంపల్లిలో మెట్రో రైలు ఆధ్వర్యంలో మల్టీ లెవల్ కార్ పార్కింగ్, కేబీఆర్ పార్క్ వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మల్టీ లెవల్ కార్ పార్కింగ్ వంటి వాటిని ఏర్పాటు చేయడానికి స్థలాలను గుర్తించాలని అధికారులు నిర్ణయించారు.

**సైకిల్ ట్రాక్స్..**

క్యూర్ పరిధిలో సైకిల్ ట్రాక్స్ ఏర్పాటు చేయడానికి అధికారులు నిర్ణయించారు. ఆఫీసుకు రెసిడెన్సీ దగ్గరగా ఉన్న ఉద్యోగులు సైకిళ్లపై వెళ్లడానికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అధికారులు నిర్ణయించారు. ముఖ్యంగా నార్సింగి, కోకాపేట్, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ప్రాంతాల్లో సైకిల్ ట్రాక్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వ్యక్తిగత వాహనాలను తగ్గించడంతోపాటు కాలుష్యాన్ని, ట్రాఫిక్ సమస్యను సైతం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## రూ.34.23 లక్షల చెక్ బౌన్స్ కేసు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి కి మరో ఎదురుదెబ్బ తగిలింది. రూ.34.23 లక్షల చెక్ బౌన్స్ కేసులో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ హైదరాబాద్ మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఖుష్బూ ఉపాధ్యాయ తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే.. 'మెసర్స్ ఇంటెల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ వనరులను వ్యక్తిగత లాభాలకు వాడుకుని కంపెనీకి నష్టం కలిగించారనే ఆరోపణలతో రోహిత్ రెడ్డి 2014లో రాజీనామా చేశారు. ఆ తర్వాత కుదిరిన ఒప్పందం ప్రకారం కంపెనీకి రూ.34,23,000 చెల్లించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చెక్ ఇచ్చారు. కానీ, తన బ్యాంక్ అకౌంట్‌లో తగినంత డబ్బు లేకపోవడంతో ఆ చెక్ మూడు సార్లు బౌన్స్ అయింది. ఈ వ్యవహారంపై లీగల్ నోటీసు పంపినా స్పందించకపోవడంతో కంపెనీ కోర్టును ఆశ్రయించింది. విచారణ అనంతరం నిందితుడు రోహిత్ రెడ్డి నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ సెక్షన్ 138 కింద దోషిగా తేలారు. అయితే, తీర్పు సమయంలో నిందితుడు కోర్టులో హాజరుకాకపోవడంతో ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేశారు. ఈ మేరకు త్వరలోనే పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టిన తర్వాత శిక్ష వివరాలను వెల్లడించనున్నారు.

## కొత్త పింఛన్ దరఖాస్తు దారులకు అలర్ట్..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు గాను అర్హతలు, అనర్హతలకు సంబంధించిన కీలక మార్గదర్శకాలను ఖరారు చేసింది. అర్హులైన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనర్హుల నిబంధనల జాబితాను విడుదల చేసింది.

**అనర్హత వివరాలు ఇలా..**

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించి ఉన్నవారు కొత్త పెన్షన్లకు అనర్హులుగా గుర్తించనున్నారు. ఇక కుటుంబానికి 3 ఎకరాలకు మించి సాగు భూమి, 7.5 ఎకరాలకు మించి మెట్ట భూమి ఉన్నట్లయితే వారికి పింఛన్ లభించదు. ఇంట్లో పిల్లలు ప్రభుత్వ, ప్రైవేట్, వృత్తి నిపుణులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేస్తున్నట్లయితే ఆ కుటుంబాలు అనర్హులుగా పరిగణించబడతాయి. అదేవిధంగా సొంతంగా రైస్ మిల్లులు, పెట్రోల్ పంపులు, ఫోర్ వీలర్స్ ఉన్న కుటుంబాలు దరఖాస్తు చేసుకోవడానికి కొత్త పింఛన్లు దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేదని ప్రటించారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇతర పింఛను పొందుతున్నా వారు నూతన పెన్షన్లకు అనర్హులని అధికారులు స్పష్టం చేశారు.

# సీ ప్లేన్ పరుగులు..

## 2 గంటల్లో హుస్సేన్‌సాగర్ టు ప్రకాశం బ్యారేజీ




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఏపీలోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోవాలంటే తెలంగాణ నుంచి గంటల పాటు ప్రయాణించాల్సిన అవసరం లేదు. ఇకపై కేవలం 2 గంటల్లోగానే హైదరాబాద్ నుంచి విజయవాడ చేరుకోవచ్చు. ఇందుకోసం సీ ప్లేన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. గతంలో ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో భేటి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇరువురు తెలంగాణ నుంచి ఏపీకి సీ ప్లేన్ సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని చర్చించారు. దీనిపై కేంద్ర మంత్రి కూడా సానుకూలంగా ఉండటంతో పనులు వేగవంతం అందుకున్నాయి. హుస్సేన్‌సాగర్‌లో ఎక్కడ సీ ప్లేన్ దిగడానికి అనువైనది? నీరు ఎంత లోతులో ఉంటుంది? సంవత్సరంలో ఎన్ని రోజులు సీ ప్లేన్ దిగడానికి అనువైన నీళ్లు ఉంటాయి? అనేదానిపై నీటిపారుదల శాఖ అధికారులతో సమాచారాన్ని సేకరించారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద ఎంత నీరు అందుబాటులో ఉంటుంది? ఎన్ని రోజుల పాటు అందుబాటులో ఉంటుందనే దానిపై కూడా కసరత్తు పూర్తి చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం సచివాలయంలో సీ ప్లేన్‌పై సమీక్షించారు. ఈ సమీక్షకు ఎయిర్ పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం హైదరాబాద్‌కు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన హుస్సేన్‌సాగర్‌ను పరిశీలించారు. ప్రయాణికులు ఎక్కడం, దిగడానికి అనువైన ప్రాంతాలను స్వయంగా అబ్జర్వ్ చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. త్వరగా ఆచరణలోకి వచ్చే విధంగా తెలంగాణ ప్రభుత్వ అధికారులు కూడా సహకరించాలని, కేంద్ర పౌర విమానాయ శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధతో ఉన్నట్లు తెలిపారు. దీంతో తెలంగాణ ప్రభుత్వ అధికారులు అన్ని విధాలుగా సహకరిస్తామని, ఏర్పాట్లు చేస్తామని చెప్పినట్లు తెలిసింది. హుస్సేన్ సాగర్‌తో పాటుగా ఇంకా ఏమైనా సీ ప్లేన్‌కు అనువైన రిజర్వాయర్‌లు, డ్యాంలు, బ్యారేజీలుంటే సూచించాలని నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టుగా సమాచారం. హుస్సేన్ సాగర్ సీ ప్లేన్ విజయవంతం అయిన తరువాత ఇతర ప్రాంతాలకు దీనిని విస్తరించనున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయ భూ సేకరణపై శుక్రవారం సచివాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షలో విద్యుత్, మున్సిపల్, మిషన్‌భగీరథ, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఏవియేషన్, నీటిపారుదల, ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. వచ్చే డిసెంబర్‌నెలాఖరు కల్లా విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు తమ శాఖల పరంగా ప్లానింగ్‌చేసుకోవాలని సూచించారు. విద్యుత్‌లైన్లు ఉంటే వాటిని తొలగించాలని, మిషన్ భగీరథ పైప్‌లైన్లు ఉంటే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఇలా అన్ని శాఖల అధికారులు తమ ప్రణాళికలను రూపొందించుకోని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌కు ప్రభుత్వం దాదాపుగా మరో వేయి ఎకరాలను సేకరిస్తుంది. ఇప్పటికే ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో సచివాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష ఇతర శాఖల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వారికున్న సందేహాలను నివృత్తి చేశారు.

# ఈవీఎం గోదాం పరిశీలన



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, నెలవారీ తనిఖీలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో గల ఈవీఎం గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా నమోదు పుస్తకం, సీసీ కెమెరాల పని తీరు, మంటల నియంత్రణ పద్ధతులను పర్యవేక్షించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో జనగామ ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల సమీక్ష



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డా. రవీందర్ నాయక్ గారు శనివారం, జిల్లాను సందర్శించి, సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ మరియు నివారణ చర్యలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలపై జిల్లా అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాల పరిస్థితుల నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్లు, తదితర సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దోమల నివారణ చర్యలు, లార్వా నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత, ఫీవర్ సర్వేలు, అనుమానిత కేసుల గుర్తింపు, పరీక్షలు మరియు చికిత్సను వేగవంతంగా చేపట్టాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత సమయంలో సాధించాలని, తక్కువ పనితీరు ఉన్న సూచికలపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేలా క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు మరియు కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డా. రవీందర్ నాయక్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. వాణిశ్రీ, జిల్లా స్థాయి అధికారులు డా. సిద్ధార్థ రెడ్డి, డా. జి. హరికృష్ణ, డా. శ్రావ్య, వైద్యాధికారులు, సంబంధిత ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశంలో నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్న ప్రభుత్వాలు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రభుత్వాలు దేశంలో నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్నాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారీ వెంకటేశ్వర్లు ఆరోపించారు. నల్లగొండ జిల్లా మిరియాలగూడెం లో ఏఐవైఎఫ్ 12 వ నియోజకవర్గ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో పేపర్ల లికులు అవినీతి ఆరోపణ లు ఎదుర్కొంటున్నారని అ ఆర్ఎస్ఎస్ బిజెపి విభజన మతతత్వ రాజకీయాల కారణంగా దేశంలో ఆందోళన చెలరేగుతున్నాయని విమర్శించారు ఈ మహసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అవకాశాల కల్పన కోసం నూతన పరిశ్రమలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో నూతన పరిశ్రమల ఏర్పాటు కోసం ఏఐవైఎఫ్ విస్తృత పోరాటాలు చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు. ఈ మహాసభకు ఆకారపు లోకేష్ అధ్యక్షత వహించగా మహాసభలో గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షులు లింగా నాయక్, సిపిఐ మండల కార్యదర్శులు రామలింగం, యాదగిరి, ఏఐవైఎఫ్ నియోజకవర్గ నాయకులు పోస్క పరమేష్, సత్య, వినయ్ కుమార్, సాయి శరన్, రఫీ, అబ్దుల్ ఖాదర్, కార్తీక్ రాజా, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్తుల ఇంటి పన్నులు కట్టిన సర్పంచ్

**మోమిన్ పేట్,ఫ్లాష్ ఇండియా :** ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు దేవరంపల్లి గ్రామస్తుల ఇంటి టాక్స్ లను రెండు లక్షలు చెల్లించి మాట నిలబెట్టుకున్నారు సర్పంచ్ అశోక్. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను సర్పంచ్ గా ఎన్నికైన నుంచి ఇప్పటి వరకు రూ. 12 లక్షలతో అంగన్వాడి కేంద్రాన్ని, 10 లక్షలతో వర్క్ షెడ్, 20 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం, 12 లక్షలతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. వచ్చే డిసెంబర్ చివరి కల్లా రెండు కోట్ల రూపాయల అభివృద్ధి పనులను చేసుకుంటామని వివరించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అండ దండలతో..




మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మన్నే శంకర్ యాదవ్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు సురేందర్ ల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని అన్నారు.



# హుండీలు కాదు..గుడి గంటలు కూడా మాయం

**ఆత్మకూరు(ఎం),ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గంట చోరీకి గురైంది. ఆలయంలోని సుమారు 5 కిలోల బరువున్న ఇత్తడి గంటను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇదే ఆలయంలో గతంలోనూ గంట చోరీకి గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. వరుసగా ఆలయాల్లో గంటలు చోరీకి గురవుతుండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేసి దొంగలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# శ్రీశైలానికి భారీగా వరద ప్రవాహం..



**అమ్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పరిధిలోని 2,32,308 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 2,15,782 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ద్వారా 66,460 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 215.8 టీఎంసీల సామర్థ్యానికి గాను 169.47 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తంగా ఉండి నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**శ్రీశైలంలో ముమ్మరంగా విద్యుదుత్పత్తి**

శ్రీశైలం జలాశయానికి కృష్ణా నది నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో విద్యుదుత్పత్తిని ముమ్మరం చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరగడంతో ప్రాజెక్టు పరిధిలోని విద్యుత్ కేంద్రాల ద్వారా నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ హైడ్రో ఎలక్ట్రిక్ స్టేషన్ లో విద్యుదుత్పత్తిని ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రాజెక్టు నీటి నిర్వహణను కొనసాగిస్తున్నారు.

# మద్యం మత్తులో తల్లిపై దాడి.. కొడుకు అరెస్ట్

**ఝరాసంగం,ఫ్లాష్ ఇండియా :** మద్యం మత్తులో తల్లిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిని సంగారెడ్డి జిల్లా ఝరాసంగం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంగం మండలం జీర్లపల్లి గ్రామానికి చెందిన చెలిమెడ రాజు (35) మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులను వేధించేవాడు. జూలై 20న ఉదయం ఇంటి ముందు శుభ్రం చేస్తున్న తల్లి పీరమ్మపై ఇంట్లోని లోహపు బిందెతో దాడి చేయడంతో ఆమె చేయి విరిగింది. అనంతరం రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, శుక్రవారం జీర్లపల్లి గ్రామంలో రాజును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. కొడుకుల ఎవరైనా తల్లిదండ్రులపై నిర్లక్ష్యం చేస్తే చట్టపైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ క్రాంతి కుమార్ హెచ్చరించారు.

# నీటి లభ్యతకు అనుగుణంగా సాగునీటి విడుదల



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించి రైతులకు సాగునీరు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని జలాశయాలు, చెరువుల నీటి నిల్వలు, ఆయకట్టు, ఖరీఫ్ సాగు, నీటి విడుదలపై ఆయన సమీక్షించారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో సుమారు 1.5 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, ఈ నెల 15వ తేదీ నుంచి మొదటి విడతగా, 25వ తేదీ నుంచి రెండో విడతగా నీటిని విడుదల చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని 770 చెరువులకు 49,643 ఎకరాల ఆయకట్టు ఉండగా, అత్యధిక చెరువుల్లో నీటి నిల్వలు 25 శాతంలోపే ఉన్నాయని అధికారులు వివరించారు. నీటి కొరత దృష్ట్యా రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి సాగు వైపు వెళ్లకుండా జొన్న, మొక్కజొన్న, కందులు, పెసర్లు, చిరుధాన్యాలు, పత్తి, ఆయిల్‌పామ్, ఉద్యాన పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సభల ద్వారా పంట మార్పిడి, తక్కువ నీటితో సాగు చేసే పంటల ప్రయోజనాలను రైతులకు వివరించాలని ఆదేశించారు. నర్మెట్ట, బచ్చన్నపేట, పాలకుర్తి, కొడకండ్ల, రఘునాథపల్లి, తరిగొప్పుల మండలాల్లో నీటి లభ్యత, సాగు పరిస్థితులను ప్రత్యేకంగా పరిశీలించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే చెరువులు, కాలువలు, కెనాళ్ల పరిరక్షణకు గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి నీటి విడుదల సమయంలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ నీటి వనరులకు నష్టం కలిగించినా, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నీటి నిల్వలు, ఆయకట్టు, పంటల సాగు, వర్షపాతం, నీటి విడుదలపై అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి...






**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రైతులు సరిపడ వర్షాలు లేని పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన, జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాజక్టులలో ఉన్న సాగునీటి లభ్యత, వినియోగం, తదితర అంశాలను అధికారులకు ప్రజాప్రతినిధులు, వివరించారు. ప్రస్తుతం ప్రాజక్టులలో ఉన్న నీరు తాగు నీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఆ తర్వాతే పంటల గురించి ఆలోచించడం జరుగుతుందన్నారు. వర్షాలు లేకపోవడం, రాబోయే రోజుల్లో పై నుండి కూడా నీరు వచ్చే అవకాశం లేనందున వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేసుకోవద్దని కోరారు. ప్రాజక్టులు, బోర్ల కింద వరి వేసుకుంటే ఏ దశలో నైనా పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, వచ్చే 6నెలలు ఇదే పరిస్థితులు ఉండవచ్చని, బోర్లలో కూడా నీరు తగ్గవచ్చని, వరికి అనుకూల పరిస్థితులు లేవని, జిల్లాలో రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేసుకోవద్దని పునరుద్ఘాటించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఈ సీజన్ లో వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, కంప సాగర్ వ్యవసాయ శాస్త్ర వేత్తలు సూచించారని, కంది, మిల్లెట్స్, వంటి పంటలు వేసుకోవాలని, ఆపత్కాల పంటలైన కంది, పెసర, మినుము, బొబ్బర్లు, ఉలవలు, ఆముదం, పొద్దు తిరుగుడు, నువ్వులు, వేసుకోవాలని సూచించారు. ఆగస్టు 15 వరకే ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే అవకాశం ఉందని, ఈ వారంలోనే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, ఇందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం ఇస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, నల్గొండ మేయర్, డిప్యూటీ మేయర్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

**భూపాలపల్లి,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వం తక్షణమే స్పందించి దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా తాగు, సాగునీటి అవసరాల కోసమే దేవాదుల ప్రాజెక్టును నిర్మించారని, నిబంధనల ప్రకారం నెలకు 6 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకోవాల్సి ఉండగా, 9 పంపులు నడవాల్సిన చోట 6 లేదా 7 మాత్రమే నడుపుతున్నారని అన్నారు. పదవులు పొందిన పాలకుల నిర్లక్ష్యం వల్లే రైతులకు నీళ్లు అందడం లేదన్నారు. రామప్ప నుంచి గ్రావిటీ ద్వారా గణపురం చెరువుకు నీటిని తీసుకురావడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.18 కోట్లు వెచ్చించి నిర్ణయం తీసుకున్నామని, ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను పక్కన పెట్టిందన్నారు. నీటిని తెచ్చే మార్గం ఉన్నా, పంటలను ఎండబెట్టడం బాధాకరమన్నారు. అదే విధంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని, వచ్చే ఆగస్టు 15 నాటికి పెంచిన పింఛన్లను లబ్ధిదారులందరికీ పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ, గణపురం మండల బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కారు ప్రమాదంలో గాయపడిన యువ వైద్యురాలి పరిస్థితి విషమం



**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాజమండ్రిలో జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువ వైద్యురాలు ప్రియాంక ఆరోగ్య పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది. ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యుల బృందం ఆమెకు చికిత్స అందిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తోంది. సమాచారం ప్రకారం.. మద్యం మత్తులో ఉన్న కొందరు వ్యక్తులు సినిమా థియేటర్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం థియేటర్ నుంచి బయటకు వస్తున్న ప్రియాంకను కారు ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ప్రమాదం అనంతరం ప్రియాంకకు రాజమండ్రిలో తొలుత 48 గంటల పాటు చికిత్స అందించారు. పరిస్థితి మరింత విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు ఆమె తండ్రి వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రమాదంలో అధికంగా రక్తం కోల్పోవడంతో ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ఉందని, వైద్యులు ప్రాణాలను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. తన కుమార్తెపై జరిగిన ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు. నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష విధించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందిస్తూ ప్రియాంక ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు తెలిపింది. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చింది.



# లియోనల్ మెస్సీని హతమార్చేందుకు ఉగ్ర కుట్ర..

ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరుగాంచిన ప్రముఖ ఫుట్ బాల్ ప్లేయర్ లియోనల్ మెస్సీ ని హతమార్చేందుకు ఉగ్ర కుట్ర చేశారు. లియోనల్ మెస్సీ తో పాటు అర్జెంటీనా జాతీయ జట్టును లక్ష్యంగా చేసుకుని దాడులకు కుట్ర పన్నినట్లు వెలువడిన వార్తలు క్రీడా ప్రపంచంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. లీకైన ఒక పోలీసు రహస్య నివేదిక ద్వారా ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మెస్సీ, ఆయన జట్టు సభ్యులకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు సదరు రిపోర్ట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. మైదానంలో అత్యంత భద్రత నడుమ మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలోనే ఈ తరహా కుట్రలు జరగడం క్రీడాభిమానులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది.లీకైన ఆ నివేదిక వివరాల ప్రకారం.. ఒక వ్యక్తి సూసైడ్ బాంబింగ్‌కు పాల్పడేందుకు యత్నించినట్లు తెలుస్తోంది. "నా శరీరానికి నాలుగు బాంబులను అమర్చుకుని, మెస్సీని పేల్చి వేసేందుకు అట్లాంటా స్టేడియానికి వెళ్తున్నాను" అని సదరు వ్యక్తి హెచ్చరించినట్లు పోలీసు రిపోర్ట్‌లో సంచలన విషయాలు నమోదయ్యాయి. ఈ ఘటనపై భద్రతా సంస్థలు అత్యంత తీవ్రంగా స్పందించి దర్యాప్తును ముమ్మరం చేశాయి. ఆ తర్వాత క్రీడాకారుల రక్షణ కోసం మైదానాలు, వారు బస చేసే ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# కామన్వెల్త్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ అస్మితకు డీఎస్పీగా ప్రమోషన్



భారత జుడోకా అస్మితా దే ఇటీవల కామన్వెల్త్ గేమ్స్-2026లో గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మిక క్రీడల్లో బంగారు పతకం గెలిచిన తొలి భారత జుడోకాగా ఆమె చరిత్ర సృష్టించింది. కామన్వెల్త్ గేమ్స్‌లో ఆమె సాధించిన చారిత్రాత్మిక విజయాన్ని గుర్తిస్తూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అస్మితను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(డీఎస్పీ)గా పదోన్నతి కల్పించనుంది. ప్రస్తుతం ఆమె యూపీ పోలీసు విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్. ప్రమోషన్ విషయాన్ని అస్మిత ఓ జాతీయ మీడియాకు తెలిపింది. ప్రమోషన్ గురించి ఇప్పటికే తనకు సమాచారం అందిందని, అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నట్టు తెలిపింది. 'యూపీ పోలీసులు నాకు మద్దతుగా నిలిచారు. కామన్వెల్త్ గేమ్స్‌కు వెళ్లకముందే ఆర్థిక సహాయం కూడా చేశారు. వారి నుంచి వచ్చిన మద్దతు, భద్రత, ఆర్థిక సహాయం.. నేనెప్పటికీ మర్చిపోను. నా కుటుంబానికి కూడా ఎన్నో విధాలుగా సహాయం చేశారు.'అని అస్మిత తెలిపింది. గతేడాది డిసెంబర్‌లో అస్మిత తండ్రి కన్నుమూశారు. 'ఈ రోజు నాన్న ఉండి ఉంటే ఎంతో సంతోషించి ఉండేవారు. ఈ ప్రమోషన్ ఆయన అంకితం చేస్తున్నా. ఆయనకు నాకు చాలా మద్దతుగా నిలిచారు.'అని తెలిపింది. అస్మిత పదోన్నతిని యూపీ పోలీస్ వర్గాలు కూడా ధ్రువీకరించాయి. ఆమె డీఎస్పీ కాబోతుందని, ముఖ్యమంత్రికి లెటర్ పంపించామని, ఆయన సంతకం చేసిన వెంటనే అస్మితకు డీఎస్పీ హోదా ఇస్తారని తెలిపాయి.

# వీసా దరఖాస్తులో తప్పుడు సమాచారం



పాకిస్తాన్ ఆల్‌రౌండర్ హంజా నజర్‌పై వేటు పడింది. వీసా దరఖాస్తులో తప్పుడు సమాచారం అందించినందుకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) అతనిపై రెండేళ్లు నిషేధం విధించింది. అంతేకాకుండా రూ.3.4 లక్షల జరిమానా వేసింది. అంతర్గత విచారణ అనంతరం గురువారం పీసీబీ అతనిపై చర్యలు తీసుకుంది. హంజా ఇంకా పాక్ తరపున ఇంటర్నేషనల్ అరంగేట్రం చేయలేదు. దేశవాళీలో అతను రాణిస్తున్నాడు. ఇటీవల ముగిసిన వెస్టిండీస్‌తో సిరీస్‌కు అతను ఎంపికయ్యే అవకాశాలు ఉన్నట్టు వార్తలు వచ్చాయి. కానీ, వీసా సమస్య కారణంగా అతన్ని ఎంపిక చేయలేదు. వీసా దరఖాస్తు ప్రక్రియ సమయంలో అతను కచ్చితమైన పూర్తి సమాచారం ఇవ్వలేదని విచారణ తేలినట్టు పీసీబీ తెలిపింది. తప్పుడు సమాచారం ఇచ్చాడని, ముఖ్యమైన వాస్తవాలను వెల్లడించలేదని పేర్కొంది.

# కెరీర్ ఆరంభంలో రెండేళ్లు ఆ కష్టాలు పడ్డా



భారత మాజీ క్రికెటర్ అజింక్యా రహానే ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రహానే టెస్టు అరంగేట్రానికి ముందు పడిన కష్టాలను గుర్తు చేసుకున్నాడు. కెరీర్ ఆరంభంలో భారత్ తుది జట్టులో చోటు కోసం చాలా కాలం వేచిచూశానని, దాదాపు రెండేళ్లు 12వ ప్లేయర్‌గానే ఉన్నానని చెప్పాడు. '2011లో జట్టులోకి వచ్చా. మొదటి రెండు సంవత్సరాలు స్థానం కోసం ఎదురుచూశా. టెస్టు అరంగేట్రం కోసం 20 గేములు ఎదురుచూశా. ఆ సమయానికి నాకు సవాల్‌తో కూడుకున్న దశ. కానీ, ఆ దశ నుంచి ఎంతో నేర్చుకున్నా. అప్పుడు నాకు రెండే మార్గాలు ఉన్నాయి. ఒకటి సానుభూతి పొందడం. మరోటి నన్ను నేను మెరుగుపర్చుకోవడం. 12వ ప్లేయర్‌గా ఉండటానికి, నీళ్లు అందించడానికి, సహచరులకు సహాయం చేయడాన్ని నేనం తప్పుగా తీసుకోలేదు. నేను ప్రతిదీ గమనించేవాడిని. అందుకే చాలా కాలం ఆడగలిగాను. పరిశీలించడం నా వైఖరికి, ఆలోచనా విధానానికి సహాయపడింది. నేనెప్పుడూ సానుభూతి పొందాలనుకోలేదు.'అని తెలిపాడు. కెరీర్ ఆరంభంలో సహనం అనేది తనకు సహజ గుణం కాదని, అనుభవంతో అది కూడా పెరిగిందన్నాడు. 'ముంబైలో లోకల్‌లో ట్రైన్‌లో ప్రయాణించడం సవాల్‌గా ఉంటుంది. అక్కడి నుంచే సహనం అలవాటైంది. చాలా కాలం ఆడాలంటే సహనం చాలా ముఖ్యం'అని రహానే చెప్పుకొచ్చాడు.

# చెమటోడ్చిన భారత బౌలర్లు.. శ్రీలంక ఎలెవన్ 363/8



శ్రీలంక ఎలెవన్‌తో శుక్రవారం ప్రారంభమైన వార్మప్ మ్యాచ్‌లో భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. బౌలర్లు తొలి రోజు ప్రత్యర్థిని ఆలౌట్ చేయలేకపోయారు. శ్రీలంక బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో భారత బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక ఎలెవన్ 8 వికెట్లు కోల్పోయి 363 పరుగులు చేసింది. మొదట ఓపెనర్లు నిషాన్ మదుష్క(66), రవిందు రసంత(71) ఆ జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఇద్దరూ హాఫ్ సెంచరీలతో రాణించారు. రవిందు ఆచితూచి ఆడగా.. నిషాన్ మాత్రం వన్డే తరహాలో బ్యాటు ఝుళిపించాడు. అతను 11 ఫోర్లు కొట్టాడు. ఈ జోడీని విడదీయడానికి భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. 20 ఓవర్లపాటు వీరు బ్యాటింగ్ చేశారు. చివరికి నిషాన్ రనౌటవడంతో ఈ జోడీకి తెరపడింది. తొలి వికెట్‌కు ఈ జంట 110 పరుగుల భాగస్వామ్యం జోడించి శ్రీలంక ఎలెవన్‌కు బలమైన పునాది వేసింది. నిషాన్ అవుటైనా రవిందు చాలా సేపు క్రీజులో ఉండి స్కోరును 200 దాటించాడు. పసిందు సూరియబందార(35), పవన్ రత్నయాకె(39), అహాన్ విక్రమసింఘె(31) కూడా విలువైన ఇన్నింగ్స్‌లు ఆడారు. శ్రీలంక స్కోరు 200 దాటక కాస్త తడబాటుకు గురైంది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి వికెట్లు తీశారు. ఈ సమయంలో కెప్టెన్ సొనాల్ దినుషా జట్టుకు అండగా నిలిచాడు. 71 బంతుల్లో 52 పరుగులు చేశాడు. రమేశ్ మెండిస్(31) కూడా పర్వాలేదనిపించాడు. తొలి రోజు ఆట కాసేపట్లో ముగుస్తుందనగా రమేశ్ మెండిస్‌ను జడేజా.. సొనాల్ దినూషను మానవ్ సుతార్ పెవిలియన్ పంపారు. ప్రస్తుతం కేశర నువాంత(9), దిలుమ్ సుదీరా(1) క్రీజులో ఉన్నారు. శ్రీలంక బ్యాటర్లు సమిష్టిగా రాణించి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. 40 ఓవర్ల తర్వాత ఇండియా బౌలర్లు పుంజుకోవడంతో శ్రీలంక ఆలౌట్ అంచున నిలిచింది. జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ చెరో 2 వికెట్లు పడగొట్టగా.. గుర్నూర్ బ్రార్ ఒక్క వికెట్ తీశాడు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ ఒక్క వికెట్ కూడా తీయకపోవడం గమనార్హం.

**గిల్ దూరం.. కెప్టెన్‌గా రాహుల్**

ట్రైనింగ్ సెషన్‌లో గాయపడిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి రోజు ఆటకు దూరంగా ఉన్నాడు. గురువారం ప్రాక్టీస్ చేస్తుండగా గిల్ కుడి చేతికి గాయమైన విషయం తెలిసిందే. దీంతో గిల్ మైదానంలోకి దిగలేదు. అతనికి బదులు కేఎల్ రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. గిల్‌ను బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తుందని బీసీసీఐ తెలిపింది. అయితే, అతనికైనా గాయం తీవ్రతపై స్పష్టత ఇవ్వలేదు. శనివారమైనా గిల్ గ్రౌండ్‌లోకి వస్తాడో? చూడాలి.

# బిజినెస్



## భారత్, చైనాలకు అమెరికా షాక్

ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యా కు ఆర్థికంగా మద్దతుగా నిలుస్తున్న దేశాలకు అగ్రరాజ్యం అమెరికా ఊహించని షాకే ఇచ్చింది. రష్యా నుంచి పెట్రోలియం, సహజ వాయువు ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న భారత్, చైనా సహా ఐదు ప్రధాన దేశాలపై 100 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించేందుకు వీలు కల్పించే కీలక బిల్లును అమెరికా సెనెట్ ఇవాళ ఆమోదించింది. 'లిండ్సే ఓ.గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'గా వ్యవహరిస్తున్న ఈ బిల్‌కు సెనెట్‌లో 86-11 ఓట్ల భారీ మెజారిటీతో ఆమోదం లభించింది. రిపబ్లికన్ పార్టీకి చెందిన సీనియర్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఇటీవలే తుదిశ్వాస విడిచారు, ఆయన పేరు మీద డెమొక్రాటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతల్ ఈ బిల్లును సంయుక్తంగా రూపొందించారు.

**టార్గెట్.. భారత్, చైనా**

అయితే, ప్రస్తుతం రష్యా నుంచి అత్యధికంగా క్రూడాయిల్, గ్యాస్ కొనుగోలు చేస్తున్న తొలి 5 దేశాల జాబితాలో చైనా, భారత్, అజర్‌బైజాన్, హంగేరీ, స్లొవేకియా ఉన్నాయి. ఈ కొత్త బిల్లు ప్రకారం.. రష్యా నుంచి చౌకగా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న ఈ 5 దేశాల ఉత్పత్తులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు కల్పిస్తుంది. ఈ బిల్లులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అక్కడి వ్యాపారవేత్తలు, ఆర్థిక సంస్థలపై ఆంక్షలు విధించడంతో పాటు, ఇరాన్ ఎనర్జీ సెక్టార్‌పై ఆంక్షల కాలాన్ని 2031 వరకు పొడిగించారు. సెనెట్‌లో ఆమోదం పొందిన ఈ బిల్లు ఇప్పుడు ప్రజాప్రతినిధుల సభ ముందుకు వెళ్లనుంది. ఆగస్టు 31న సభ తిరిగి సమావేశమైన తర్వాత అక్కడ కూడా ఆమోదం పొందితే అధ్యక్షుడు ట్రంప్ సంతకంతో ఇది పూర్తిస్థాయి చట్టంగా మారనుంది.

# డీప్‌ఫేక్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం



సోషల్ మీడియా వేదికగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో చేస్తున్న డీప్‌ఫేక్ వీడియోలు, ఫోటోల వ్యాప్తిపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల మాతృ సంస్థ అయిన మెటా నుంచి ఇదే అంశంపై తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన కంప్లీట్ రిపోర్టు ఇవ్వాలని కోరింది. అయితే, ఈ మధ్య కాలంలో సెలబ్రెటీలు, పొలిటికల్ లీడర్లు, సామాన్యుల డీప్‌ఫేక్ వీడియోలు సృష్టిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న ఘటనలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి. వాటిని అరికట్టడంలో సోషల్ మీడియా దిగ్గజాలు విఫలమవుతున్నాయనే విమర్శల నేపథ్యంలో కేంద్ర సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఈ మొత్తం వ్యవహారంపై ఫోకస్ పెట్టింది.

**లీగల్ ఒపీనియన్ కోసం కేంద్ర వెయిటింగ్..**

డీప్‌ఫేక్స్‌ను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవాలో టెక్ నిపుణుల నుంచి కేంద్ర ప్రభుత్వం లీగన్ ఒపీనియన్ తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఐటీ చట్టం , నిబంధనలు 2021 ప్రకారం సదరు ప్లాట్‌ఫారమ్‌లకు ఇచ్చిన సేఫ్ హార్బర్ రక్షణను తొలగించే అవకాశాలను కూడా కేంద్రం చాలా సీరియస్‌గా పరిశీలిస్తున్నది. కాగా, ఇప్పటికే సోషల్ మీడియా వేదికల్లో తమ ప్లాట్‌ఫారమ్‌లలో వచ్చే ఏఐ కంటెంట్‌ను గుర్తించే విధంగా లేబుల్స్ వేయాలని, ఫిర్యాదు వచ్చిన అతి తక్కువ సమయంలోనే వాటిని తొలగించాలని ఆదేశాలు కూడా జారీ అయిన విషయం తెలిసిందే.

# పెరిగిన బంగారం ధరలు..



గత కొద్దిరోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోతున్నాయి. ఈ రోజు (శుక్రవారం) కూడా బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1090 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 1000 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 820 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,52,350 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,39,650 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,14,260 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.




# గ్యాస్ సిలిండర్ ధరలు

ఈ నెల(ఆగస్టు) ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల పై కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తగ్గిన ఈ ధరలు ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. ఇదిలా ఉంటే.. గత నెల(జులై)తో పోలిస్తే గృహ వినియోగ ఎల్‌పిజి ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. నేడు(శనివారం) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**ఆగస్టు 8వ తేదీ నాటి గ్యాస్ సిలిండర్ ధరలు**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50

# పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు



గత నెలలో పెట్రోల్, డీజిల్, సీఎన్జీ ధరలు స్వల్పంగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల(ఆగస్టు) 1వ తేదీ నుంచైనా ధరలు తగ్గుతాయెమో అని వాహనాదారులు ఆశ పడ్డారు. కానీ వారికి నిరాశే మిగిలింది. ఈ తరుణంలో ఇవాళ(శనివారం) పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. హైదరాబాద్‌లో ప్రస్తుతం పెట్రోల్ ధర లీటరుకు రూ.115.69గా ఉంది. ఇదిలా ఉంటే.. గత జులై నెలతో పోల్చితే కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధరల్లో కూడా ఎలాంటి మార్పులు లేవు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ప్రస్తుతం కిలో సీఎన్‌జీ గ్యాస్ ధరలు హైదరాబాద్‌లో రూ.109.00, వరంగల్‌లో రూ.108.00, విశాఖపట్నంలో రూ.92.50, విజయవాడలో రూ.102.00గా ఉన్నాయి.

**ఆగస్టు 8వ తేదీ నాటి పెట్రోల్ డీజిల్ ధరలు..**

హైదరాబాద్
లీటర్ పెట్రోల్ ధర: రూ.115.69
లీటర్ డీజిల్ ధర రూ.103.82
విజయవాడ
లీటర్ పెట్రోల్ ధర: రూ.117.88
లీటర్ డీజిల్ ధర రూ.105.49




# ట్రైలర్ విడుదల తేదీ వచ్చేసింది

పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందు, శ్వేతా త్రిపాఠి, రవి కిషన్, జితేంద్ర కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మీర్జాపూర్: ది మూవీ'. గుర్మీత్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక 'మీర్జాపూర్' వెబ్ సిరీస్‌కు దేశవ్యాప్తంగా ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సిరీస్‌కు సంబంధించిన తదుపరి ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న 'మీర్జాపూర్: ది మూవీ'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. 'మీర్జాపూర్: ది మూవీ' ట్రైలర్‌ను ఆగస్టు 11న విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్, ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతోంది.

# నయనతార Hi వాయిదా..




యంగ్ హీరో కవిన్, లేడీ సూపర్‌స్టార్ నయనతార కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న లేటెస్ట్ మూవీ 'హాయ్'. విష్ణు ఎడవన్ దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ కామెడీ మూవీని రౌడీ పిక్చర్స్, సెవన్ స్క్రీన్ స్టూడియో సంయుక్తంగా నిర్మించాయి. జెన్ మార్టిన్ సంగీతం అందించాడు. ఇదిలా ఉంటే.. హాయ్ మూవీ ఆగస్టు 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే.. సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా కూడా ఆగస్టు 14న రిలీజ్‌కు ఉండటంతో ఈ సినిమా వాయిదా పడబోతున్నట్లు గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ వార్తలనే నిజం చేస్తూ.. హాయ్ సినిమా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు మేకర్స్. అలాగే ఆగస్టు 28న రిలీజ్ కాబోతున్నట్లు అఫీషియల్‌గా ప్రకటిస్తూ ఓ కొత్త పోస్టర్‌ను షేర్ చేశారు.



# గ్లామర్ ట్రీట్‌తో యువతను ఆకట్టుకుంటున్న డైసీ షా

బాలీవుడ్‌తో పాటు సౌత్ ఇండియన్ చిత్రాల్లోనూ నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ డైసీ షా. మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత సినీ రంగంలోకి అడుగుపెట్టి నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ ఫొటోల్లో డైసీ షా అదిరిపోయే హాట్ లుక్‌లో కనిపించారు. స్కై బ్లూ కలర్ టైట్ డ్రెస్‌లో విభిన్న యాంగిల్స్‌లో ఫోజులిస్తూ గ్లామర్ ట్రీట్ ఇచ్చారు. చెవులకు స్టైలిష్ ఇయర్ రింగ్స్ ధరించడంతో పాటు.. ఒక చేతికి బ్రేస్‌లెట్, వేళ్లకు ఉంగరాలు ధరించి తన లుక్‌ను మరింత స్టైలిష్‌గా మార్చుకున్నారు. ఇక జుట్టును గాలికి వదిలేసి ఇచ్చిన ఫోజులు ఆమె అందాన్ని మరింత హైలెట్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక డైసీ షా 1984 ఆగస్టు 25న ముంబైలో జన్మించింది. ఈమె చాలా ఏళ్లు గణేష్ ఆచార్య వద్ద దాదాపు అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పనిచేసింది. ఇక 2011 లో వచ్చిన భద్ర చిత్రం ద్వారా వెండితెరకు పరిచయం అయింది. ప్రస్తుతం విజయవంతంగా కెరియర్ను ముందుకు సాగిస్తుంది.



# బంపర్ ఆఫర్ దక్కించుకున్న మానుషి

తాజాగా ఆమెకు ఒక భారీ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో గోల్డెన్ ఛాన్స్ దక్కినట్లు సోషల్ మీడియాలోనూ వార్తలు తెగ వైరల్ అవుతున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిలింస్ బ్యానర్‌పై తొలిసారిగా ఒక విభిన్నమైన హారర్ జోనర్‌లో సినిమాను తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మోస్ట్ అవైటెడ్ మూవీలో బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్‌ను హీరోగా ఎంపిక చేయగా.. హీరోయిన్‌గా మానుషి చిల్లర్ నటించబోతున్నట్లు టాక్. బిగ్ బ్యానర్‌లో స్టార్ హీరో సరసన అవకాశం రావడంతో మానుషి కెరీర్‌కు ఇది పెద్ద ప్లస్ కానుందని తెలుస్తోంది. ఇక ఈ హారర్ థ్రిల్లర్ మూవీకి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్‌ను 2026 చివరి నాటికి పట్టాలెక్కించేందుకు చిత్రబృందం ఏర్పాట్లు చేస్తోందట. అలాగే ఈ సినిమాను 2027లో గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.




# 'స్పైడర్ మ్యాన్' కలెక్షన్స్ సునామీ..



టామ్ హాలాండ్, జెండాయ నటించిన స్పైడర్ మ్యాన్ బ్రాండ్ న్యూ డే సినిమా థియేటర్లలో దూసుకు వెళ్తోంది. విడుదలైన మొదటి రోజు నుంచి ఇప్పటి వరకు కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఈ సినిమా విడుదలైన మొదటి వారంలో రూ.300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ రాబట్టింది. ఒక లేటెస్ట్ గా ఈ మూవీ రూ.400 కోట్ల గ్రాస్ మార్క్ చేరుకున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. కేవలం ఎనిమిది రోజుల్లోనే, రూ.400 కోట్లు దాటి, బాలీవుడ్ సినిమా బోర్డర్ 2 రికార్డు బ్రేక్ చేసింది. ఈ బోర్డర్ సినిమా 8 రోజుల్లో రూ392 కోట్ల వరకు రాబట్టింది. అటు నార్త్ అమెరికాలో కూడా ఈ మూవీ మంచి కలెక్షన్స్ రాబడుతోంది. తొలి వీకెండ్ లోనే అత్యధికంగా 360 మిలియన్ల డాలర్లు కాబట్టి మొదటి స్థానాన్ని కూడా కైవసం చేసుకున్నట్లు చెబుతున్నారు. అటు గ్లోబల్ పరంగా చూస్తే అవెంజర్స్ ఎండ్ గేమ్ రికార్డును దాటి బిలియన్ డాలర్ల క్లబ్ లో చేరిన సినిమాగా స్పైడర్ మాన్ నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా ఇప్పటి వరకు రూ.9600 కోట్లు వసూలు చేసి, ఆల్ టైం రికార్డ్ సృష్టించినట్లు నివేదికలు చెబుతున్నాయి.

# అదిరిపోయే రిప్లై ఇచ్చిన నటి!

'ది ప్యారడైజ్' విషయానికి వస్తే నాని హీరోగా నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో 'దసరా' సూపర్ హిట్ అయిన విషయం తెలిసిందే. అదే కాంబోలో వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో సినిమాపై అంచనాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఇందులో నాని, రాఘవ్ జుయల్, మోహన్ బాబు, కయదు లోహర్, తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, ఈశ్వరి రావు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. పలుమార్లు రిలీజ్ డేట్ వాయిదా పడిన తర్వాత 'ది ప్యారడైజ్'ను 2026 సెప్టెంబర్ 24న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆమె ఐటం సాంగ్ లో కనిపిస్తారనే ప్రచారం నిజమా కాదా అనేది అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే తేలనుంది. అయితే అందుతున్న సమాచారాన్ని బట్టి  ఈ మూవీలో కీర్తి ఐటం రోల్ దాదాపు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది.మరోవైపు కీర్తి సురేష్ చేతిలో వరుస ప్రాజెక్టులు ఉన్నాయి. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డోరతీ'లో ఆమె నటిస్తోంది. ఈ మూవీకి ఇళయరాజా సంగీతం అందిస్తుండగా, రిషికాంత్, సనత్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా 2026 సెప్టెంబర్ 25న విడుదల కానుంది. అలాగే విజయ్ దేవరకొండ సరసన 'రౌడీ జనార్ధన'లో కీర్తి కనిపించనుంది. దీంతో పాటు వెంకటేష్ దగ్గుబాటి, నందమూరి కళ్యాణ్ రామ్ నటిస్తున్న ప్రాజెక్టుల్లోనూ ఆమె భాగమయ్యారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న వెంకీఅనిల్ 5 లేదా ఎన్‌కేఆర్ఆర్ 2గా పిలుస్తున్న ప్రాజెక్ట్‌తో పాటు 'సత్యవాన్ సావితిరి', 'అక్క', 'రాఫ్తార్' వంటి సినిమాలు కూడా ఆమె లైనప్‌లో ఉన్నాయి. దీంతో ప్రత్యేక డ్యాన్స్ నంబర్‌పై వచ్చిన ప్రచారం కంటే, కీర్తి చేతిలో ఉన్న వరుస క్రేజీ ప్రాజెక్టులే ఆమె కెరీర్‌లో ప్రస్తుతం ఆసక్తికరమైన అంశంగా మారాయి.




Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**